
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు

5

శుక్రవారం 13 డిసెంబరు 2024



# జూనియర్ విద్య.. గాడి తప్పుతోంది..!



జిల్లాలో జూనియర్ (కళాశాల) విద్య గాడితప్పుతోంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థుల్లో క్రమశిక్షణ ఏమాత్రం లేదు. కొన్ని కళాశాలల్లో మొబైల్ వాడకం విచ్చలవిడిగా సాగుతున్నా వారిని అదుపుచేయడంలో అధ్యాపకులు విఫలమవుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించేది ఇంటర్మీడియట్టే. ఈ సమయంలో వీరిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అధ్యాపకులు చేతులెత్తేస్తున్నారు. కళాశాలలకు వచ్చామా, వెళ్లామా అనే రీతిలో అధ్యాపకులు ఉన్నారు. దీంతో పాటు కుల వివక్ష, గ్రూపు తగాదాలకు అధ్యాపకులు పరిమితమయ్యారు. ఇన్ని సమస్యల మధ్య జూనియర్ విద్య సక్రమంగా సాగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- రోజురోజుకు విద్యార్థుల్లో దిగజారిపోతున్న క్రమశిక్షణ
- కళాశాలలోనే మొబైల్ వాడకం
- అదుపుచేయడంలో అధ్యాపకులు విఫలం
- గ్రూపు తగాదాలు, కుల వివక్షలో తలమునకలైన అధ్యాపకులు




(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అందులో 5,149 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రస్తుతం జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పేద, మధ్యతరగతికి చెందిన వారు మాత్రమే. ప్రైవేట్ కళాశాలలకు వెళ్లే స్థోమత లేని వారు ఇక్కడ చదువుకుంటున్నారనేది అందరికి తెలిసిందే. వీరిని ఒక లక్ష్యంతో ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచన అధ్యాపకుల్లో లేదని చెప్పవచ్చు. కళాశాలల్లో అడ్మిషన్ల సమయంలో విద్యార్థులకు 10వ తరగతిలో సబ్జెక్టుల వారీగా వచ్చిన మార్కుల ఆధారంగా ఆయా గ్రూపుల్లో చేర్చుకోవాల్సి ఉంది. కానీ అధ్యాపకులు వారి గ్రూపులో విద్యార్థుల సంఖ్య తక్కువైతే తమ ఉద్యోగానికే వ ు ప్పు అ ని మార్కులతో సంబంధం లేకుండా వారివారి గ్రూపుల్లో అడ్మిషన్లు ఇస్తున్నారు. దీని కారణంగా ఆర్ట్స్ గ్రూపులో చదవాల్సిన విద్యార్థులు సైన్స్ గ్రూపులో చేరుతున్నారు. ఇలాంటి వారు ఇంటర్మీడియట్ ఫెయిల్ అవుతున్నారు. దీంతో జిల్లాలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం తగ్గుతోంది. దీనికి తోడు ఇంటర్మీడియట్ ఫెయిల్ కావడంతో చాలామంది విద్యార్థులు అంతటితో చదువును ఆపేస్తున్నారు.

### అధ్యాపకులంతా సమానమే..

జూనియర్ కళాశాలల్లో లెక్చరర్ల మధ్య కులాధిపత్యం ఉన్నట్టు మా దృష్టికి రాలేదు. అలా ఎక్కడైనా ఉన్నట్టు తెలిస్తే చర్యలు తీసుకుంటాం. అధ్యాపకులంతా సమానమే. జూనియర్ కళాశాలల్లోకి సెల్‌ఫోన్లు నిషేధం. ఎవరైనా విద్యార్థి పొరపాటున సెల్‌ఫోన్ తెస్తే కేర్‌టేకర్ లెక్చరర్ దానిని స్వాధీనం చేసుకుని తరగతులు అయిపోయిన తర్వాత ఆ విద్యార్థికి అందజేస్తారు.

- రవి, ఆర్జేడీ

### ఎయిడెడ్ కళాశాలల విలీనంతో..

గ్రూపు తగాదాలు, కుల తగాదాలు ఒకవైపు ఉండగా.. మూడేళ్ల కిందట మరో తగాదా తెరపైకి వచ్చింది. ఎయిడెడ్ కళాశాలలను ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాటి వైసీపీ ప్రభుత్వం విలీనం చేసింది. కళాశాలలతో పాటు అధ్యాపకులను కూడా విలీనం చేశారు. ముందుగా పనిచేస్తున్న జూనియర్ కళాశాల సిబ్బంది, ఎయిడెడ్ కళాశాలల నుంచి చ్చిన సిబ్బంది మధ్య పొసగడం లేదని అంటున్నారు. ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేసే వారిలో చాలా మంది డబ్బులు పెట్టి ఉద్యోగాలు కొనుక్కున్నారని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో పనిచేసే వారు విమర్శిస్తున్నారు. సిబ్బంది అయినా, అధ్యాపకులైనా డబ్బులకు ఉద్యోగం కొనుక్కొని వచ్చిన వారని మెరిట్ ప్రాతిపదికన వచ్చిన వారు కాదని, వారికి ఆయా సబ్జెక్టులపై పట్టు లేదంటూ వీరు విమర్శిస్తున్నారు. ఈ విమర్శలు కూడా అధ్యాపకుల మధ్య తగాదాలను మరింత పెంచి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందకుండా చేస్తున్నాయి.

### విద్యార్థుల చదువుపై అధ్యాపకుల శ్రద్ధ ఏదీ..?

10వ తరగతి పాసయ్యాక కొంతమంది విద్యార్థులు ఏ గ్రూపులో చేరాలో నిర్ధారించుకోకుండానే జూనియర్ కళాశాలకు వెళ్లి దరఖాస్తు చేస్తున్నారు. ఆ సమయంలో అక్కడ ఏ గ్రూపునకు చెందిన అధ్యాపకుడు ఉంటే అతను ఆ విద్యార్థిని బ్రెయిన్ వాష్ చేసి తన గ్రూపులో చేర్చుకుంటున్నాడని తెలిసింది. సైన్స్ గ్రూపులో చదివేంత టాలెంట్ లేని విద్యార్థి సైన్స్ గ్రూపులో చేరితే అతను ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత కాడు. దీంతో ఆ విద్యార్థి చదువు ఇంటర్మీడియట్‌తో అటకెక్కుతోంది. మరికొంతమంది అధ్యాపకులు ఇలాంటి విద్యార్థులు ఫెయిల్ అయితే తమ గ్రూపునకు చెడ్డపేరు వస్తుందని ప్రైవేటుగా ఫీజులు కట్టి పరీక్షలు రాసేలా ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధ్యాపకులు ఆయా గ్రూపుల్లో వెనకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తీర్ణు లు అయ్యేలా చేస్తే వా రి జీవితం బాగుం టుంది. కానీ వా రిని పరీక్షల నాటికే అధ్యాపకులు తమ స్వార్థం కోసం బలి చేయడం ఎంత వరకు సబబు అని పలువురు తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. ఏదిఏమైనా జూని యర్ విద్య ఇన్ని సమస్యల మధ్య ముందుకు ఎలా సాగుతుందో అర్థం కాని ప్రశ్నగా మిగిలింది.

### అధ్యాపకుల్లో గ్రూపు తగాదాలు

జిల్లాలోని కొన్ని కళాశాలల్లో పనిచేసే అధ్యాపకుల మధ్య సఖ్యత పూర్తిగా కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధ్యాపకుల్లో గ్రూపు తగాదాలు, కుల వివక్ష ఎక్కువగా ఉందనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని కళాశాలల్లో మూడు గ్రూపులుగా విడిపోయి అధ్యాపకులు పనిచేస్తున్నట్లు సమాచారం. అగ్రకులాలకు చెందిన వారంతా ఒక గ్రూపు అయితే, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వర్గాలు ఒక గ్రూపుగా, వెనుకబడిన తరగతులకు చెందిన వారు ఒక గ్రూపుగా సాగుతున్నారు. ఈ గ్రూపుల గొడవతో అధ్యాపకులు పంతాలకు పోతుండటంతో తమను గాలికి వదిలేశారని విద్యార్థులు బహిరంగంగా అంటున్నారు. ఏదైనా ఒక గ్రూపునకు సంబంధించిన అధ్యాపకులకు సమస్య వస్తే.. మిగిలిన అధ్యాపకులు వారిపై తీవ్ర విమర్శలు చేసి ఆ సమస్యను మరింతగా పెంచడం సర్వసాధారణంగా మారిందని తెలిసింది. ఇది ఎంతలా మారిందంటే తరగతి గదుల్లో విద్యార్థులు సైతం అగ్రవర్ణాలవారు, ఎస్సీ ఎస్టీలు, బీసీలకు చెందిన విద్యార్థులు వేర్వేరుగా కూర్చుంటున్నారని తెలిసింది. విద్యార్థుల చదువుపై ఎప్పటికప్పుడు ఆయా సబ్జెక్టు అధ్యాపకులు దృష్టిసారించాల్సి ఉన్నా అవేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

# సాగునీటి సమరం


- వేంపల్లె తహశీల్దార్ కార్యాలయం వద్ద ఘర్షణ వాతావరణం
- వైసీపీ నాయకులపై బీటెక్ రవి అనుచరుల దౌర్జన్యం
- నామినేషన్ ఎలా వేస్తారో చూస్తాం అంటూ హెచ్చరికలు
- అప్రమత్తం అవుతున్న వైసీపీ శ్రేణులు

వేంపల్లె/పులివెందుల డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల వ్యవహారంపై దుమారం రేగుతోంది. వేంపల్లె, తొండూరు తహశీల్దార్ కార్యాలయాల వద్ద గురువారం ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. సెస్సు చెల్లించేందుకు వేంపల్లె తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లిన వైసీపీ నాయకులపై బీటెక్ రవి అనుచరులు దౌర్జన్యం చేసినట్లు తెలిసింది. సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి గురువారం సాయంత్రం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహశీల్దార్ హరినాథరెడ్డితో ఎన్నికల విషయాలపై చర్చించినట్లు సమాచారం. అనంతరం బీటెక్ రవి తన అనుచరులతో కలిసి స్థానిక టీడీపీ నాయకులతో కార్యాలయం ఆవరణలో చర్చించుకుంటున్నారు. ఆ సమయంలో ఎన్నికల్లో నామినేషన్ వేసేందుకు వీలుగా అవసరమైన నీటి తీరువా పన్ను చెల్లించి రశీదులు తీసుకునేందుకు గిడ్డంగివారిపల్లెకు చెందిన వైసీపీ నాయకులు పద్మనాభరెడ్డి, వివేకానందరెడ్డి అక్కడికి వచ్చారు. అయితే.. వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ వారిపై దౌర్జన్యాలు చేశారని, ఎన్నికల్లో నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారని, మా ప్రభుత్వంలో ఇప్పుడెలా నామినేషన్ వేసేందుకు వచ్చారని టీడీపీ నేతలు వారిని హెచ్చరించినట్లు తెలిసింది. అక్కడున్న టీడీపీ నాయకులు ఇద్దరు వైసీపీ నాయకులను వెళ్లిపోవాలంటూ హుకుం జారీ చేశారని తెలిసింది. ఈ విషయం తెలిసిన వెంటనే వైసీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సతీశ్‌రెడ్డి ఇంట్లో జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైసీపీ కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, సర్పంచు ఆర్.శ్రీను తదితరులు భేటి అయినట్లు తెలిసింది. ఎన్నికల రోజున నామినేషన్ వేయకుండా అడ్డుకుంటే ప్రతిఘటించేందుకు వీలుగా మండలంలోని కార్యకర్తలకు సంకేతాలిచ్చినట్లు తెలుస్తోంది.

### తొండూరులో..

సాగునీటి సంఘాల ఎన్నికల విషయమై తొండూరులో వివాదం చోటుచేసుకుంది. వైసీపీకి చెందిన పలువురు నాయకులు సాగునీటి ఎన్నికల సందర్భంగా సెస్ చెల్లించేందుకు తొండూరు తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. అదే సమయంలో టీడీపీ నాయకులు కొంతమంది అక్కడకు వెళ్లి వైసీపీ నుంచి సెస్ కట్టించుకోవద్దని తహశీల్దార్ రామచంద్రారెడ్డిని కోరారు. దీంతో వీరి మధ్య గొడవ జరిగే అవకాశం ఉందని ఎస్‌ఐ పెద్ద ఓబన్నకు తహశీల్దార్ సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్‌ఐ అక్కడకు వచ్చి వైసీపీ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇంతలో పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి తహశీల్దార్ కార్యాలయానికి వచ్చారు. వైసీపీ నాయకుల నుంచి సెస్ తీసుకోవద్దని ఆయన అన్నారు. అందుకు ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని తహశీల్దార్ సమాధానమిచ్చారు. సెస్ చెల్లిస్తే ఎన్నికల్లో పోటీచేసేందుకు అవకాశం ఉంటుంది కాబట్టి సెస్ వసూలు చేయవద్దని తహశీల్దార్‌కు తెగేసి చెప్పారు. అధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని వారికి మరోమారు తహశీల్దార్ సమాధానమిచ్చారు. దీంతో బీటెక్ రవి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

తెలుగు గంగ భూములు కబ్జా చేసేందుకు ఎక్సకవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం



వైసీపీ హయాంలో జరిగిన భూకబ్జాలపై విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఎక్కడెక్కడ భూకబ్జాలు జరిగాయి.. ప్రభుత్వ భూములు ఎక్కడ ఎంత అన్యాక్రాంతం అయ్యాయి అనేది సమగ్రంగా గుర్తించింది. భూకబ్జాదారులపై ల్యాండ్‌గ్రాబింగ్ చట్టం తీసుకొచ్చింది. ఇకపై భూకబ్జాలకు పాల్పడితే ఆ చట్టాన్ని ప్రయోగిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదేపదే చెబుతున్నారు. ఓ వైపు భూకబ్జాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంటే.. మరోవైపు రూ.4కోట్ల విలువచేసే తెలుగుగంగ కార్యాలయానికి చెందిన భూమిని పట్టపగలే కబ్జా చేసేందుకు తెరతీశారు. దీనిపై తెలుగుగంగ ఎస్ఈ సీకేదిన్నె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ కబ్జా బాగోతం బయటకు వచ్చింది.

# ఆక్రమణలో.. తగ్గేదేలా..!

- రూ.4కోట్ల తెలుగుగంగ ప్రాజెక్టు భూమి కబ్జాకు యత్నం
- ఎక్సకవేటర్‌తో పట్టపగలే చదునుకు యత్నం
- 1988లోనే రైతులకు పరిహారం చెల్లించిన భూమికి..
- 2019లో రిజిస్టర్ అయిందంటూ దొంగ డాక్యుమెంట్

(కడప-ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కడప శివార్లలోని అంగడివీధి సమీపంలో 1984-85లో 65.69ఎకరాల్లో తెలుగుగంగలో పనిచేసే ఉద్యోగుల కోసం భవనాలు, నివాసం ఉండేందుకు ఇళ్ల నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. రైతులకు పరిహారం ఇచ్చి 1988లో భూములను తీసుకుని నిర్మించారు. ఇక్కడ రెండుదశల్లో నిర్మాణాలను చేపట్టారు. పాఠశాలలు, పార్కు ఏర్పాటుచేశారు. గెస్ట్‌హౌస్ ఉంది. ఇక్కడ నీటి, మట్టి టెస్టింగ్ ల్యాబ్‌లు, సెంట్రల్ వాటర్ కమిషన్ కార్యాలయం, ఎన్‌సీసీ క్యాంప్ తదితర ఆఫీసులు ఉన్నాయి. ఇది అతి పెద్ద ప్రభుత్వ కార్యాలయాల సముదాయం లాంటిది. అక్కడ తెలుగుగంగ కార్యాలయాలతో పాటు పే అండ్ అకౌంట్ ఇతర ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి. కడప నగరం ఇప్పుడు విస్తరిస్తోంది. తెలుగుగంగ కార్యాలయం ఉన్న ప్రాంతంలో కూడా ఇళ్ల నిర్మాణానికి జనం ఆసక్తి చూపుతున్నారు. ఈ చుట్టుపక్కల లేఅవుట్లు కూడా వెలిశాయి.

### ఆస్తులు కొట్టేసేందుకు..

తెలుగుగంగ కాలనీ, భవనాల సముదాయం 65.69ఎకరాల్లో ఏర్పడింది. మామిళ్లపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 19, 20, 21, 22, 23, 24, 25/1ఎ, 25/1బి, 25/2, 25/3ఎ2, 25/3బి, 25/4బి, 27, 28, 29, 44, 45, 46, 47, 51, 52, 53, 54, 77, 79, 81/1, 81/2ఎ, 119, 120, 158 లలో మొత్తం 65.69 ఎకరాలు ఉంది. ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు, ఉద్యోగుల ఇళ్లు, పార్కు ఇతరత్రా ఉండగా.. ఇంకా చాలా భూములు ఖాళీగా ఉన్నాయి. వీటి చుట్టూ నివాసగృహాలు ఈ మధ్య పెరిగిపోయాయి. కొందరు రియల్టర్లు అక్కడ భూములు కొని వెంచర్లు వేస్తే, జగన్ హయాంలో కొందరు వైసీపీ నేతలు తెలుగుగంగ భూములను ఆక్రమించేసి వెంచర్లు వేసి అమ్ముకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏదొక స్థలం చూపించి తెలుగుగంగ భూముల్లోనే ప్లాట్లు వేసి అమ్మారని చెబుతారు. ఇక్కడ సెంటు రూ.2.50లక్షల నుంచి రూ.4లక్షల మధ్య ఉంది.

### రూ.4కోట్ల స్థలం కబ్జాకు యత్నం

ఇక తెలుగుగంగకు సంబంధించి సర్వేనెంబర్ 77లో 1.63ఎకరాల భూమి ఉంది. ఈ భూమి సుబ్బన్నగారిపల్లెకు వెళ్లే రహదారి పక్కనే ఉంది. ఈ స్థలం పక్కనే రెండు వెంచర్లు ఉన్నాయి. సెంటు రూ.3లక్షల ధర ఉంది. అయితే సర్వేనెంబర్ 77లోని 1.63ఎకరాల భూమి నాదే అంటూ ఒకతను ఎక్స్‌వేటర్ పెట్టి భూమి చదును చేసేందుకు ప్రయత్నించాడు. దీనిని గమనించిన తెలుగుగంగ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ భూమి నాదే 2019లో నాకు రిజస్టర్ అయిందంటూ అతను దబాయించాడు. 1988లోనే పరిహారం ఇచ్చి భూమిని తీసుకున్నామని సిబ్బంది చెప్పారు. దీంతో సిబ్బందిపై అతను దాడి చేసే ప్రయత్నం చేశాడంటున్నారు. ఈ విషయాన్ని సిబ్బంది వెంటనే తెలుగుగంగ ఎస్ఈ వెంకటరామయ్య దృష్టికి తీసుకెళ్లగా ఆయన సీకేదిన్నె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సుమారు రూ.4కోట్ల విలువైన ఈ భూమిని కొట్టేయాలని పలువురు కొద్దిరోజులుగా ప్లాన్ చేస్తున్నారని అంటున్నారు. అయితే కబ్జాలో కింగ్‌గా పేరున్న వైసీపీ నేతలు ఈ విషయంలో సైలెంట్‌గా ఉండగా.. ఒకతను మాత్రం కబ్జాకు ప్రయత్నించడం దుమారం లేపింది. దొంగ రిజిస్ట్రేషన్లతో కొట్టేసే ఎత్తుగడలో కొందరు ఉన్నట్లు చెబుతారు. గతంలో జరిగిన భూకబ్జాలపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా.. తాజాగా రూ.4కోట్ల స్థలానికి ఎసరుపెట్టడం గమనార్హం.

### ఒక్కసెంటు కూడా కబ్జా కానివ్వం..



తెలుగు గంగ భూములకు సంబంధించి ఒక్క సెంటు కూడా కబ్జా కానివ్వం. అన్యాక్రాంతమైన భూములన్నీ తిరిగి స్వాధీనం చేసుకుంటాం. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే మైదుకూరు మండలంలో తెలుగుగంగ భూములను ఆక్రమించేసి ప్లాట్లు వేసి విక్రయించారని గుర్తించాం. వారిపై కేసులు నమోదు చేస్తాం.

- డి.వెంకటరామయ్య, ఎస్ఈ, తెలుగు గంగ

విజయవాడలో జరిగిన సదస్సులో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్



# భూకబ్జాలపై టాస్క్‌ఫోర్స్

- గండికోటను పర్యాటకంగా అభివృద్ధిచేద్దాం
- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

కడప, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూకబ్జాలు ఎక్కువా జరిగాయని, వీటిపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేయనున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. అమరావతిలో రెండు రోజుల పాటు సీఎం చంద్రబాబు కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ హాజరయ్యారు. మొదటి రోజు బుధవారం సదస్సులో రాబోయే ఐదేళ్ల వృద్ధిరేటు పెరిగేందుకు లక్ష్యం నిర్ణయించుకున్నారు. ఇక రెండవ రోజు గురువారం నాటి సదస్సులో కడప జిల్లా గురించి ముఖ్యమంత్రి ప్రస్తావించారు. "వైసీపీ హయాంలో రెవెన్యూ శాఖలో చాలా తప్పులు జరిగాయి. కడప జిల్లాలో పెదఎత్తున భూకబ్జాలు జరిగాయి. జనం ఆస్తులను బెదిరించి స్వాధీనం చేసుకున్నారు. ఫ్రీహోల్డ్ భూముల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వానికి వచ్చే ఫిర్యాదుల్లో 70శాతం రెవెన్యూకే అందుతున్నాయి. ఇప్పుడు ఆ తప్పులను సరిచేయాల్సిన అవకాశం వచ్చింది. ఇది కలెక్టర్‌కు మంచి అవకాశం. మీ శక్తి ఏంటో నిరూపించండి. ఇంకా చాలా తప్పులు జరిగాయి. వీటిని సరిదిద్దాలి. భూ అక్రమాలపై కలెక్టర్, ఎస్పీ, ఆర్డీఓ, డీఎస్‌ఓలు కలిసి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తాం. అక్రమార్కుల భరతంపట్టాలి" అని సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రపంచంలోని పది బెస్ట్‌ప్లేసుల్లో గండికోట ఒకటని, దీనిని అభివృద్ధి చేసి నెంబర్ వన్ టూరిస్ట్‌ప్లేస్‌గా మారుద్దాం అన్నారు. అక్కడ పర్యాటకులకు అవసరమైన వసతులు, హోటల్స్‌ను ఏర్పాటు చేద్దామన్నారు. కొప్పర్తి పారిశ్రామికవాడలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని వసతులు కల్పిద్దామన్నారు. ఇంకా అనేక అంశాలపై సీఎం వివరించారు. ఇక స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాలు, కార్యాచరణ తదితర అంశాలపై కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు చర్చించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జేసీ అదితిసింగ్, డీఆర్‌ఓ శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఓబులమ్మ, డీపీఓ రాజ్యలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

# నేడు స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ విడుదల

- విజయవాడకు తరలి వెళ్లిన ప్రతినిధులు

కడప కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం విజయవాడలో స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్-2047ను విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుంచి వివిధ శాఖలకు చెందిన ప్రతినిధులు తరలివెళ్లారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద గురువారం మధ్యాహ్నం వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు, ప్రముఖులతో బయలుదేరిన బస్సులను జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి తలపెట్టిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి జిల్లా నుంచి 9బస్సుల్లో వివిధ రంగాలకు చెందిన సుమారు 340 మంది ప్రతినిధులను పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, పర్యాటక శాఖ అధికారి సురేశ్‌కుమార్, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు వెళుతున్న బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న జేసీ అదితిసింగ్



# ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసం

- పరిశీలించిన క్లూస్ టీం

పెండ్లిమర్రి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేపల్లె గ్రామం వద్ద ఉన్న స్వర్గీయ నదమూరి తారక రామారావు విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. విగ్రహానికి తల, చేతిని పెద్ద బండరాయితో విరగగొట్టారు. ఈ విషయం తెలిసి గురువారం ఉదయం సీఐ చల్లని దొర, ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, కడప నుంచి వచ్చిన క్లూస్ టీం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసునమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వీలైనంత త్వరగా విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను పట్టుకుంటామన్నారు.



## డ్యూటీలకు డుమ్మా కొడితే సెలవే



- ఎఫ్ఆర్ఎస్ విధానం అమలు
- జిల్లా ఖజానాశాఖలో ప్రక్షాళన

7


## ఆయన సేవలు ఆదర్శం

- సొంత నిధులు, దాతల సహకారంతో పాఠశాలల అభివృద్ధి
- ఎక్కడ పనిచేస్తే అక్కడ.. ఆధునిక సౌకర్యాల కల్పన
- పలువురిచే ప్రశంసలు అందుకుంటున్న రామకిష్టారెడ్డి

6



# ఆయన సేవలు ఆదర్శం



ఆయన అందరిలాగే సాధారణ ఉపాధ్యాయుడు. అయితే తాను పనిచేసే పాఠశాలపై ఆయన చూసే శ్రద్ధ అసాధారణం. అధ్వాన్నంగా ఉన్న పాఠశాల పరిసరాలతో పిల్లల బోధనకు ఆటంకం కలుగుతుందని భావించి సొంత నిధులతో వాటి అభివృద్ధికి నడుం బిగించారు. పలు పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్ది పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు ముత్తుమల రామక్రిష్ణారెడ్డి.

- సొంత నిధులు, దాతల సహకారంతో పాఠశాలల అభివృద్ధి
- ఎక్కడ పనిచేస్తే అక్కడ.. ఆధునిక సౌకర్యాల కల్పన
- పరిసరాలను సుందరంగా చేయడం..
- విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా విధులు
- పలువురిచే ప్రశంసలు అందుకుంటున్న రామక్రిష్ణారెడ్డి

(కడప-ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలం పెండ్లిమర్రి పంచాయతీ సమితి పాఠశాల ఉపాధ్యాయుడుగా రామక్రిష్ణారెడ్డి 1984లో బాధ్యతలు స్వీకరించారు. పాఠశాల నిండా విద్యార్థులున్నా గ్రామం దాటి బయట ప్రదేశం చూసినవారు లేరు. దీంతో ఆయన విద్యార్థులను గిద్దలూరు నుంచి రైలులో మహానంది క్షేత్రానికి తీసుకువెళ్లారు. వారిలో మానసిక వికాసంతోపాటు ఆనందం నింపారు. అక్కడ నుంచి ఆయన సుంకేసుల పల్లె, గురప్పగారిపల్లె, బూరుగమానుపల్లె, రామేశ్వరం, ముదిరెడ్డిపల్లె, కలసపాడు తదితర పాఠశాలల్లో పనిచేశారు. అక్కడ పాఠశాలల్లో అధ్వాన్నంగా ఉన్న పరిసరాలు విద్యార్థుల బోధనకు ఆటంకంగా మారుతున్నాయని గ్రహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేశారు. సొంతనిధులు, దాతల సహకారంతో పలు పాఠశాలలను అభివృద్ధి చేశారు.

2014 సంవత్సరంలో కలసపాడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా బదిలీ అయ్యారు. పది మంది విద్యార్థులతో అధ్వానంగా ఉన్న పరిసరాలు, పాడుబడ్డ బడి ఆయనకు స్వాగతం పలికాయి. వెంటనే ఆయన విద్యాశాఖ అధికారుల అనుమతితో పాడుబడ్డ భవనాలు తొలగించి రూ.8 లక్షల తన సొంత నిధులను ఖర్చు చేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేశారు. మరో రూ.5లక్షలు గ్రామస్థులు ఆయనకు విరాళం అందించి సహకరించారు. వంట గది, సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు, డాక్టర్ సర్వేపల్లె రాధాక్రిష్ణ, ఏపీజే అబ్దుల్‌కలాం విగ్రహాల ఏర్పాటు, ప్రతి తరగతి గదిలో గోడలకు చిత్రాలు, విద్యుద్దీకరణ, కంప్యూటరు ఏర్పాటు, ఉద్యానవనం ఏర్పాటు చేసి విద్యార్థుల సంఖ్యను 110 వరకు చేశారు.

### విహార కేంద్రంగా పాఠశాలలు

రామక్రిష్ణారెడ్డి అభివృద్ధి చేసిన కలసపాడు, రామేశ్వరం పాఠశాలలు ఉద్యాన మరియు విహార కేంద్రాలుగా మారాయి. ఆయన పాఠశాలలను తీర్చిదిద్దిన విధానం చూసి చుట్టుపక్కల పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు రాష్ట్ర విద్యాశాఖాధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం సందర్శిస్తూ ఉండేవారు. ఆయన చేసిన అభివృద్ధిపై జిల్లా, రాష్ట్రస్థాయి విద్యాశకటాలుగా మరియు తిరుపతిలో రాష్ట్రస్థాయి విద్యాస్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ సంధ్యారాణి, భాస్కర్‌రావు, పలువురు ఆర్జేడీలు, డీఈవోలు ఆయన చేసిన అభివృద్ధి చూసి ప్రశంసలు కురిపించారు.



### ఆకట్టుకుంటున్న టీఎల్‌ఎం

రామక్రిష్ణారెడ్డి పనిచేస్తున్న పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఆయన ఏర్పాటు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) విద్యార్థులకు ఎంతగానో ఉపయోడపడుతోంది. తరగతి గదుల నిండా దేశ నాయకుల చిత్రాలు, వారి వివరాలు చదువును శులభంగా నేర్చుకునేందుకు ఉపయోగపడుతోంది. తరగతి గదుల గోడల నిండా ఇలాంటి వాటితో నింపారు. దాంతో విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి పెరుగుతోంది.

### పలు పురస్కారాలు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్న ముత్తుమల రామక్రిష్ణారెడ్డి ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల నుంచి పలు పురస్కారాలు అందుకున్నారు. 2009లో ఉత్తమ ఆదర్శ ఉపాధ్యాయ అవార్డు, 2010లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2012లో అప్పటి ప్రిన్సిపల్ కార్యదర్శి చందనాఖాన్ చేతుల మీదుగా సక్సెస్ స్టోరీ ఆఫ్ రామేశ్వరం అవార్డు, 2013లో అప్పటి విద్యాశాఖమంత్రి పార్థసారధి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2014లో మదర్‌తెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వారిచే గురు బ్రహ్మ అవార్డు, 2019లో అప్పటి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మహ్మద్‌అలీ చేతుల మీదుగా జాతీయ స్థాయి ఆవిష్కార్ అవార్డు, 2024లో వ్యాస మహర్షి పురస్కారం అందుకున్నారు.

### పాఠశాలలే దేవాలయాలు

పాఠశాలలను దేవాలయాలుగా భావించి అంకితభావంతో పనిచేశాను. పిల్లల భవిష్యత్తు కోసం దాతల సహకారం, నా సొంత నిధులతో పాఠశాలల అభివృద్ధికి కృషి చేశాను. అందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రోత్సహించి నన్ను ముందుకు నడిపారు. ప్రతి పేదబిడ్డ పాఠశాలలో ఏ లోటు రాకుండా చదువుకుని భవిష్యత్తులో ఉన్నతస్థానం పొందాలన్నదే నా ఆశయం.

**- ముత్తుమల రామక్రిష్ణారెడ్డి, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, రామేశ్వరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల**



ఉద్యానవనాన్ని తలపిస్తున్న రామేశ్వరం పాఠశాల

### సుందరంగా రామేశ్వరం, కలసపాడు పాఠశాలలు

జిల్లా సరిహద్దులో పోరుమామిళ్ల మండల పరిధిలో ఉన్న రామేశ్వరం మారుమూలపల్లె. అక్కడ పాఠశాలలో రామక్రిష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టే నాటికి అధ్వాన్నంగా ఉన్న పరిసరాలు, అంతంత మాత్రం పిల్లల హాజరు ఉండేది. దీనిని చూసి మనసు చలించిన ఆయన 2005-13 సంవత్సరాల మధ్య తన సొంత నిధులు రూ.2లక్షలు పాఠశాల అబివృద్ధికి ఖర్చు చేశారు. చుట్టూ ప్రహరీగోడ, బండపరువు, ఉద్యానవనంగా తోట, పూలమొక్కలు, దేశ నాయకుల చిత్రపటాలు, సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు చేయించారు. ఆయన చేస్తున్న పనులు చూసి గ్రామస్థులు లక్షా 46వేల రూపాయలు అందించారు. ప్రస్తుతం ఆయన మరో దఫా రామేశ్వరం పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయుడుగా కొనసాగుతూ మరో రెండు లక్షల రూపాయల వరకు పాఠశాలకు ఖర్చు చేశారు.



కలసపాడు ప్రాథమిక పాఠశాలలో రామక్రిష్ణారెడ్డి ఏర్పాటు చేసిన సూక్తుల బోర్డులు, గోడలకు ప్రముఖుల చిత్రాలు

# జీవో 145ను రద్దు చేయండి

**● కోర్టు విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన ● జేసీకి వినతిపత్రం అందజేత**



జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

రాయచోటిటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి జిల్లా కేంద్రంలో ఉన్న ఫస్ట్ ఏడీజే కోర్టుల్లో ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం జరగాల్సిన క్రిమినల్ కేసులు జరిగే అవకాశం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 145ను వెంటనే రద్దు చేయాలని రాయచోటి న్యాయవాదులు గురువారం రెండవరోజు కోర్టు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌ను కలిసి జీవో రద్దుకు తాము చేస్తున్న ఆందోళనను ప్రభుత్వానికి వివరించాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జీవో 145 వలన రాష్ట్రంలోని 26 జిల్లాల్లో కూడా భవిష్యత్తులో ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం నమోదయ్యే కేసులు ఆయా జిల్లా కేంద్రాల్లో జరిగే అవకాశం లేకుండా పోతుందన్నారు. రాయలసీమ జిల్లాల మొత్తాన్ని తిరుపతి కేంద్రంగా ఒకే ఒక కోర్టు ఉంటుందని, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఎన్‌డీపీఎస్ కేసులు కేవలం నాలుగు ప్రాంతాల్లో మాత్రమే ట్రైల్ జరిగే అవకాశం ఉందని దీనివలన కక్షిదారులు ప్రతి వాయిదాకు సుదూర ప్రాంతానికి ప్రయాణం చేసి కోర్టులకు హాజరు కావాల్సి వస్తుందన్నారు. ప్రజల ముంగిట్లోకి న్యాయం చేరేలా న్యాయవ్యవస్థ అభివృద్ధి కావాలని, దేశ అత్యున్నత న్యాయస్థానం ఎంత చెబుతున్నా ప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా న్యాయ వ్యవస్థను ప్రజలకు దూరం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డెయ్య, సహాయ కార్యదర్శి నాగముని, భారత న్యాయవాదుల సంఘం కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు టీ.ఈశ్వర్, సీనియర్ న్యాయవాదులు రాజ్‌కుమార్‌రాజు, ధనుంజయ్‌కుమార్, చిన్నయ్య, రామాంజులు, మిఠాయి ఖాదర్‌బాషా, వరలక్ష్మి, జూనియర్ ఆనంద్, ఉత్తేజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జీఆర్‌సీకి అధికారుల హాజరు




మహిళా సమాఖ్య భవనంలోని జీఆర్‌సీ సెంటర్‌లో హాజరైన అధికారులు

మదనపల్లె టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యో తి): మహిళలకు వేధింపులు, సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మదనపల్లెలో ఏర్పాటు చేసిన జెండర్ రీసోర్సు సెంటర్(జీఆర్‌సీ)కు అధికారుల గైర్హాజరుపై ఆంధ్రజ్యోతిలో గత శుక్రవారం 'కమిటీ సభ్యులెక్కడ' శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ప్రతి గురువారం జీఆర్‌సీలో కమిటీ సభ్యులైన ఎంపీడీవో, సీడీపీవో, ఎస్ఐ, ఏపీఎం, మహిళా సమాఖ్య లీడర్లు, సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులు హాజరు కావాలి. కానీ మదనపల్లెలో జీఆర్‌సీ ప్రారంభించిన తరువాత రెండు గురువారాలు అధికారులు, కమిటీ సభ్యులు హాజరు కాలేదు. దీనిపై గత గురువారం పరిశీలించిన ఆంధ్రజ్యోతి వార్త ప్రచురించింది. ఈ విషయమై కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ జీఆర్‌సీ సెంటర్ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ క్ర మంలో మూడో గురువారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద జీఆర్‌సీలో కమిటీ సభ్యులైన ఎంపీడీవో తాజ్‌మస్రూర్, సీడీపీవో సుజాత, ఎస్ఐ హరిహరప్రసాద్, ఏపీఎం సుబ్రమణ్యం, మహిళా సమాఖ్య లీడర్లు హాజరయ్యారు. జీఆర్‌సీని బలోపేతం చేసి మహిళలపై వేధింపులు, గృహహింస, లైంగిక వేధింపులు తదితర సమస్యలను ఇక్కడే ఫిర్యాదు చేసేలా, వాటిని ఇక్కడే పరిష్కరించేలా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

# కూటమి ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం

**లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల తాళాల పంపిణీలో ఎమ్మెల్యే**




లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, చైర్‌పర్సన్ మనూజ

మదనపల్లె టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పట్టణాల్లోని నిరుపేదలకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వమే న్యాయం చేస్తుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం మండలంలోని ఎర్రగన్నమిట్ట వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వం పట్టణ పేదలకు టిడ్కో ఇళ్లను మంజూరు చేస్తే వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టు రద్దు చేసి, కాలయాపన చేసిందన్నారు. టిడ్కో ఇళ్ల కోసం డీడీలు చెల్లించిన ప్రజలు ఐదేళ్లు ఎదురుచూపులు చూడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టి ఆరునెలల కాలంలోనే టిడ్కో ఇళ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. మొత్తం 39 బ్లాకుల్లో నిర్మించిన 1872 ఇళ్ల తాళాలను ప్రజలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ, కమిషనర్ ప్రమీల, మాజీ కౌన్సిలర్లు రాధ, లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు రాటకొండ భారతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుల నిర్లక్ష్యంతోనే వ్యక్తి మృతి?

**ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులపై మృతుడి బంధువుల ఆరోపణలు**

రాజంపేటటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం నవోదయ కాలనీకి చెందిన రాజశేఖర్ (37) మృతి చెందిన వ్యవహారం వివాదాస్పదంగా మారింది. వివరాల్లోకి వెళితే.. ఆకేపాడు నవోదయ కాలనీకి చెందిన రాజశేఖర్ వ్యక్తిగత కారణాల వల్ల బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు రాజంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బుధవారం నుంచి గురువారం వరకు అతనికి వైద్యసేవలు ఆసుపత్రిలోనే అందజేశారు. అయితే గురువారం మధ్యాహ్నం రాజశేఖర్‌కు ఉన్నట్లుండి సీరియస్ కావడంతో అతని పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు వెళ్లాలని వైద్యులు చేతులెత్తేసినట్లు వారి బంధువులు తెలిపారు. కడప రిమ్స్‌కు తరలిస్తుండగా రాజశేఖర్ మృతి చెందాడు. ఈ విషయమై వారి బంధువులు వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజశేఖర్ ఆసుపత్రికి చేరిన వెంటనే మెరుగైన వైద్య చికిత్స కోసం వేరే ఆసుపత్రికి తరలించాలని తమకు చెప్పలేదని, ఇక్కడే బాగు చేస్తామని చెప్పడంతో తాము ఏమీ చేయలేకపోయామని తెలిపారు. నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని అతడి బంధువులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై రాజంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌ను వివరణ కోరగా పురుగుల మందు తాగిన రాజశేఖర్‌కు అన్నివిధాల వైద్య చికిత్సలు చేశామని, ఇందులో డాక్టర్ తప్పు లేదని, మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు వారి బంధువులు తరలిస్తుండగా చనిపోయినట్లు వారి బంధువుల ద్వారా తెలిసిందన్నారు. ఇదే విషయమై మన్నూరు సీఐ మహ్మద్‌అలీని వివరణ కోరగా.. ఈ విషయంపై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

# కాటేజి పనులు వెంటనే పూర్తి చేయాలి

**● టూరిజం సీఈ నరసింహారావు**

బి.కొత్తకోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో జరుగుతున్న ఏపీ టూరిజం కాటేజిల ఆధునికీకరణ, మరమ్మతు పనులు ఈనెలాఖరుకు వంద శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏపీ టూరిజం సీఈ వీవీఎల్ నరసింహారావు మేనేజర్ సాల్విన్‌రెడ్డిని ఆదేశించారు. గురువారం ఆయన ఈఈ సుబ్రమణ్యం, డీఈ శ్రీనివాస్‌లతో కలిసి హార్సిలీహిల్స్‌ను సందర్శించారు. హిల్స్‌పై ఏపీ టూరిజం నిధులతో కాటేజీలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల నాణ్యతలో ఎక్కడా పొరబాట్లు జరగకుండా చూడాలని స్థానిక టూరిజం మేనేజర్‌ను ఆదేశించారు. ఎన్ని కాటేజిలలో పనులు జరుగుతున్నాయి, ఆ పనుల కోసం వెచ్చిస్తున్న నిధుల గురించి అధికారులకు మేనేజర్ వివరించారు.



హార్సిలీహిల్స్‌లో పనులను పరిశీలిస్తున్న అధికారులు

# నామినేటెడ్ పదవులపై కసరత్తు

- జిల్లాలో మార్కెట్ కమిటీల్లో 150 మందికి ..
- సింగిల్ విండోల్లో 90 మందికి అవకాశం
- కసరత్తు చేస్తున్న అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు

కలికిరి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికార పార్టీకి చెందిన ప్రధాన నాయకులు, క్రియాశీలక కార్యకర్తలకు మండల, నియోజకవర్గ స్థాయిల్లో పదవులు కట్టబెట్టడానికి కసరత్తు జరుగుతోంది. ప్రధానంగా మార్కెట్ కమిటీలు, సింగిల్ విండోల్లో పదవులను భర్తీ చేయడానికి అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో అధికార పార్టీకి చెందిన ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు దీనికోసం పెద్ద ఎత్తున కసరత్తు చేపట్టినట్లు తెలుస్తోంది. జిల్లాలోని 10 వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో మొత్తం 150 మందిని నియమించే అవకాశముంది. అదేవిధంగా 30 సింగిల్‌విండోల్లో ఒక్కోదానికి చైర్మన్‌తో సహా ముగ్గురు ప్రకారం మొత్తం 90 మందితో పర్సన్ ఇన్‌చార్జ్‌ల కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. నియోజకవర్గాల్లోని కొంతమంది ప్రధాన క్రియాశీలక నాయకులకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్‌లలో డైరెక్టర్లుగా నియామకాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇంకా కొన్ని కార్పొరేషన్లకు చైర్మన్‌లను, డైరెక్టర్లను నియమించేందుకు టీడీపీ అధిష్ఠానం ప్రక్రియను కొనసాగిస్తోంది. ఈ స్థాయిలో పదవులు పొందలేని వారికి నియోజకవర్గ స్థాయిలో సముచిత ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచన కారణంగానే మార్కెట్ కమిటీలు, సింగిల్ విండోల్లో నియామకాలు ఆలస్యమవుతున్నట్లు కూడా చెబుతున్నారు.

### మార్కెట్ కమిటీ పదవులకు రిజర్వేషన్లు

జిల్లాలో ప్రస్తుతం మొత్తం 10 వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. 2019 డిసెంబరు 12న ప్రకటించిన 120 జీవోతో అప్పటి ప్రభుత్వం మార్కెట్ కమిటీల పరిధులను పునర్వ్యవస్థీకరించింది. కొన్ని మండలాలను అటూ ఇటూ మార్చి సర్దుబాటు చేశారు. ఈ సందర్భంలోనే వాల్మీకిపురం ఏఎంసీని విడగొట్టి కలికిరి, కలకడ మండలాలకు కలిపి కలికిరి ఏఎంసీని కొత్తగా ప్రకటించారు. అదే ఏడాది మార్కెట్ కమిటీల నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లను కూడా అప్పటి ప్రభుత్వం అమలు చేసింది. ఆ తరువాత 2020-22 కాలానికి రెండేళ్ల గడువుతో నామినేటెడ్ కమిటీలను ప్రకటించారు. ఈ గడువు పూర్తయిన అనంతరం రెండో విడతగా కొన్ని కమిటీలను యథాతథంగా మరో రెండేళ్లు కొనసాగించడమో లేక తరువాత రెండేళ్ల కాలానికి కొత్త కమిటీలను నామినేట్ చేయడమో జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఈ కమిటీలన్నీ రద్దయ్యాయి. తాజాగా ఇప్పుడు కూడా రూల్ ఆఫ్ రిజర్వేషన్లతోనే కమిటీల నియామకం చేపట్టాలని మార్కెటింగ్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో



ఈ విధానాన్నే ఇప్పుడు కూడా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు స్పష్టత వచ్చింది. రిజర్వేషన్లు మొదటిసారిగా అమల్లోకి వచ్చిన తరువాత రెండు పర్యాయాలు కమిటీల నియామకాలు జరిగాయి. రెండో పర్యాయం ఏర్పాటైన కమిటీలకు రోస్టర్ విధానాన్ని అనుసరిస్తూ నామినేటెడ్ సభ్యులను భర్తీ చేశారు. ఇప్పుడు కూడా ఇదే రోస్టర్ విధానాన్నే కొనసాగించనున్నట్లు చెబుతున్నారు. అంటే జిల్లాలోని 10 మార్కెట్ కమిటీలు ఈ ఏడాది రద్దయ్యేనాటికి రెండోసారి రోస్టర్ విధానంలో రిజర్వేషన్లు ఇలా కొనసాగాయి. రాజంపేట మార్కెట్ కమిటీ ఓసీ (మహిళ), రైల్వేకోడూరు కమిటీ ఓసీ (జనరల్), రాయచోటి బీసీ (జనరల్), లక్కిరెడ్డిపల్లె ఓసీ (జనరల్), మదనపల్లె ఓసీ (జనరల్), పీలేరు బీసీ (జనరల్), కలికిరి ఎస్సీ (మహిళ), వాల్మీకిపురం ఎస్టీ (మహిళ), తంబళ్లపల్లె (ములకలచెరువు) బీసీ (మహిళ), బి.కొత్తకోట (అంగళ్లు) ఓసీ (మహిళ).

### అన్ని పదవుల్లోనూ మహిళలకు 50 శాతం

జిల్లాలోని పది మార్కెట్ కమిటీల్లో ఒక్కో దానికి చైర్మన్, వైస్ చైర్మన్‌లతో కలిపి వివిధ కేటగిరీల్లోనుంచి 15 మందిని నామినేట్ చేయాల్సి ఉంది. వీరు కాకుండా ప్రతి కమిటీకి సంబంధిత ఎమ్మెల్యే గౌరవాధ్యక్షుడిగా, సింగిల్ విండో అధ్యక్షుడు సభ్యుడిగా నియామకవుతారు. రిజర్వేషన్లను కేటాయించడానికి జిల్లాను యూనిట్‌గా పరిగణిస్తారు. ఈ ప్రక్రియ ప్రకారం జిల్లాలోని 10 ఏఎంసీల్లో ఐదింటికి తప్పనిసరిగా మహిళా చైర్మన్లను నియమించాల్సి ఉంది. ఇక ప్రతి కమిటీ సభ్యుల్లో సైతం 50 శాతం డైరెక్టర్ పదవులు మహిళలకే దక్కుతాయి. అంటే ప్రతి కమిటీలోనూ ఏడు లేక 8 మంది మహిళలను నియమించనున్నారు. అదేవిధంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం కులాల వారీగా 50 శాతం కమిటీలు అంటే జిల్లాలో 5 కమిటీలు రిజర్వ్ కానున్నాయి. మిగతా ఐదు కమిటీలు ఇతరులకు కేటాయిస్తారు. యాభై శాతం రిజర్వేషన్లలో బీసీ, మైనారిటీలకు కలిపి 29 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం చైర్మన్, డైరెక్టరు పదవులు కేటాయించనున్నారు. తాజా నియామకాల్లో పాటించే రోస్టర్ విధానంలో రెండో రోస్టర్ (2022-24)లో జరిగిన కేటాయింపులు పూర్తిగా మారిపోనున్నాయి. ఇందులో కలికిరి మార్కెట్ కమిటీకి రెండో రోస్టర్‌నే పాటించాల్సి ఉందని చెబుతున్నారు. 2020-22 మొదటి విడతలో కలికిరి ఏఎంసీ చైర్మన్ పదవిని ఓసీ జనరల్‌కు కేటాయించారు. రెండో విడత 2022-24లో కలికిరి ఏఎంసీ చైర్మన్ పదవిని ఎస్సీ మహిళకు కేటాయించారు. అయితే రెండో విడతలో ఎస్సీ మహిళ నియామకం జరపకుండానే గడువు పూర్తయ్యింది. దీంతో రోస్టర్ విధానం కొనసాగాల్సి ఉన్నందువల్ల కలికిరి చైర్మన్ పదవిని మూడో రోస్టర్ (2024-25)లో యథాతథంగా ఎస్సీ మహిళకే కేటాయించాల్సి ఉంది. దీంతో జిల్లా స్థాయిలో కూడా మూడో రోస్టర్‌లో మరిన్ని మార్పులు చోటు చేసుకోనున్నాయని తెలుస్తోంది.

# డ్యూటీలకు డుమ్మా కొడితే సెలవే

- ఎఫ్ఆర్ఎస్ విధానం అమలు
- జిల్లా ఖజానాశాఖలో ప్రక్షాళన



జిల్లా ఖజానా శాఖ కార్యాలయం

కడప కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆ శాఖ జిల్లా ఆర్థిక వ్యవహారాలను చక్కబెట్టే కీలకశాఖ. 20 వేల మంది ఉద్యోగులు, మరో 19వేల మంది పెన్షనర్లకు సంబంధించి జీతబత్యాలు చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. సంక్షేమం అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వ ఖజానా నుంచి రూ.120 కోట్ల వరకు నెలనెలా చెల్లింపులు ఉంటాయి. అలాగే ప్రభుత్వానికి కూడా జిల్లా వ్యాప్తంగా పన్నుల చెల్లింపుల రూపంలో రూ.150 కోట్లు వరకు ఖజానాకు జమ అవుతుంది. ఇంతటి కీలక శాఖలో ఉద్యోగులు విధులకు ఎప్పుడు వస్తారో.. అసలు వస్తారో రారో తెలియని పరిస్థితి. తరచూ వీళ్లు విధులకు డుమ్మాలు కొట్టడంలో ఆరితేరారనే విమర్శలు ఉన్నాయి. అయితే నెలనెల లక్షల్లో జీతాలు తీసుకోవడంలో సిద్ధహస్తులని చెబుతున్నారు. వీరి వ్యవహారశైలిపై ఫిర్యాదులు వెళ్లడంతో ఖజానాశాఖ రాష్ట్ర డైరెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు. ఆర్థిక వ్యవహారాలను చక్కబెట్టాల్సిన ఎస్‌టీఓలు, సిబ్బంది పనిచేసే కార్యాలయాల్లో ఉండకపోవడంపై జిల్లా డిప్యూటీ డైరెక్టర్లకు తలంటి.. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఉద్యోగులు, పెన్షనర్లకు జావాబు దారీతనంగా పనిచేసి ప్రభుత్వాకి చెడ్డపేరు రాకుండా చూడాల్సిన ఉద్యోగులు గాడి తప్ప డంపై ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్) అమలుకు శ్రీకారం చుట్టారు. విధులకు డుమ్మా కొట్టే ఉద్యోగులు, సిబ్బంది తాము పని చేసే కార్యాలయాలకు వచ్చి ఎఫ్ఆర్‌సీ వేస్తే సరి.. లేకపోతే వాళ్లకు సెలవు ఖాయంగా మారడంతో కొందరి ఉద్యోగులు జీర్ణించుకోలేక పోతున్నారు.

### సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లా...

ఖజానా శాఖలో ఉండి ఉద్యోగాలు వెలగబెట్టాల్సిన కొందరు ఎస్టీఓలు (సబ్ ట్రజరీ ఆఫీసర్లు) సీఎఫ్ఎంఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లా మారారనే విమర్శలు ఉన్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల తరహాలోనే ల్యాప్‌ట్యాపులను సంకన పెట్టుకొని వర్క్‌ఫ్రం హోం పద్ధతిలో ఇన్నాళ్లు ఇళ్ల వద్దనే సీఎఫ్ఎంఎస్ బిల్లులను, ఆఫీసు వ్యవహారాలను చక్కబెట్టే వారు. దీంతో జిల్లా కార్యాలయంలో ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన సందేహాలు చెప్పే నాధుడే కరువయ్యారనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో ప్రముఖులకు సంబం ధించిన ఇరువురు ఎస్టీవోలు డ్యూటీలకు డమ్మాలు కొట్టినా అధికారి పట్టించుకునేవాడు కాదనే ఆరోపణలు ఉన్నాయి. అంతే కాదు ఉద్యో గులు జిల్లా కార్యాలయం వద్ద గంటల తరబడి నిరీక్షించిన తమ అరియర్స్, పెన్షన్లు, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్సుమెంట్ లాంటి ఆర్థిక వ్యవహారాలకు చెందిన ఫైళ్లు ఏదశలో ఉన్నాయో తెలుసుకోవాలంటే నగటు ఉద్యోగికి తలనొప్పిగా మారింది. ఇపుడు రాష్ట్ర ఆర్థికశాఖ డైరెక్టర్ నిఘా పెట్టడంతో వీరి ఆటలకు చెక్ పడినట్లయ్యింది.

### ఎఫ్ఆర్ఎస్‌కు టోకరా?

ఖజానాశాఖ ఉద్యోగులకు ఎన్ని ఆంక్షలు పెట్టినా.. వాటిని తమకు అనుకూలంగా మార్చు కోవడంలో దిట్టలంటున్నారు. ఉద్యో గులు జవాబుదారీతనంగా కార్యాలయాల్లో పని చేసేలా ఫేస్ రికగ్నేషన్ సిస్టంను ప్రభుత్వం తెస్తే దానిని కూడా కొందరు అనుకూలంగా మార్చు కుంటున్నారని సహ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. కొందరు ఆఫీసు పనుల సాకుతో ఎఫ్ ఆర్ఎస్ వేసుకొని ఎంచక్కా తమ సొంత పనులు చేసు కుంటూ.. మళ్లీ సాయంత్రం వేళల్లో ఏదో ఒక సమయంలో.. అదే లోకేషన్‌కు వచ్చి ఎఫ్ఆర్ఎస్ వేసుకుంటూ టోకరా కొడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. మరి కొందరు ఎస్టీవోలు ఎంక్వైరీల పేరుతో ఎక్కడో ఏదో ఒక ఊరిలో ఉండి అక్కడ నుంచి టూర్ అనే ఆప్షన్ ద్వారా హాజరు వేసుకుంటూ విధులకు డుమ్మాలు కొడుతున్నట్లు సమాచారం.

### సీనియర్ల స్థానంలో జూనియర్లకు పెద్ద పీట

సాంకేతిక పరిజ్ఞానం పరిఢవిల్లుతున్న సమయంలో జీత భత్యాలు, పెన్షన్లు సీఎఫ్ఎంఎస్ పద్ధతిలో ఆన్‌లైన్‌లో జరిగే ఈ రోజుల్లో ఆర్థికశాఖ కార్యాలయంలోని కొందరు ఉద్యోగులకు కాసులు కురిపిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. గతంలో బిల్లుబిల్లుకు ఎంతో కొంత సమర్పించుకుంటేనే ట్రెజరీలో పాస్ అయ్యేవని ఆశాఖకు పెద్ద మచ్చే ఉండేది. కానీ ఇపుడు కూడా ఏడాది కాలంగా పెండింగ్‌లో పడిన అరియర్స్, ఇతరత్రా పెండింగ్ బిల్లులు చేయా లంటే లంచం ఇస్తేనే బిల్లులు పాస్ అన్నట్లుగా సాగుతోందనేది నగ్న సత్యం.

ఈ విషయాలపై జిల్లా ఖజానాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లను వివరణ కోరగా.. రాష్ట్ర ప్రభుత్వం ఖజానాశాఖ ఉద్యోగులు కార్యాలయాల్లోనే విధులు నిర్వర్తించేలా ఫేస్ రికగ్నేషన్ సిస్టం అమలు చేస్తోంది. పనిచేసే కార్యాలయాల పరిధిలోనే వాళ్లు ఉదయం-సాయంత్రం ఎఫ్ఆర్ఎస్ వేయాల్సి ఉంటుంది. వాళ్లు కార్యాలయాల్లో ఉన్నారా లేదా అనే విషయాలను పరిశీలించడం జరుగుతోంది. కొందరు ఉద్యోగులు పాత పద్ధతిలో ఉన్నారు. లంచాలు తీసుకుంటున్నట్లు, బిల్లుల పాస్‌కు పైసలు అడిగినట్టు తన దృష్టికి వస్తే చర్యలు తప్పవన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు వేపరాల విద్యార్థులు


వెంకట హారిణి, సుప్రజ

మైలవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే ఉద్దేశ్యంతో భారతీయ విజ్ఞాన మండలి నిర్వహించే కౌశల్ క్విజ్ పోటీలకు వేపరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వెంకటహరిణి, సుప్రజ అనే విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బాలయ్య తెలిపారు. వీరు ఈనెల 30వ తేదీ విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీలకు పాఠశాల కోఆర్డినేటర్‌గా జీవశాస్త్ర ఉపాధ్యాయుడు నరసింహులు వ్యవహరిస్తున్నారని తెలిపారు.

## 15న అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపికలు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈనెల 15వ తేదీ ఆదివారం ఉదయం 7-30 గంటలకు అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ప్రధానంగా ఎంపికలకు వచ్చే వారు తమ ఆధార్‌కార్డు కాపీ, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్, (ఫారమ్-5) పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, స్టడీ సర్టిఫికెట్, ఒరిజినల్‌తో పాటు తమ కిట్ బ్యాగ్‌లు కూడా వెంట తీసుకురావాలని సూచించారు.

## రైల్వే ఎన్నికల్లో ఎస్సీఆర్ఈఎస్ సంఘ్ విజయం


విజయోత్సవంలో ఎస్సీఆర్ఈఎస్ సంఘ్ నేతలు

కొండాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధి కార్మిక సంఘాల ఎన్నికల్లో ఎస్సీఆర్ఈఎస్ సంఘ్ విజయం సాధించినట్లు కడప బ్రాంచి అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి ఈశ్వరయ్య తెలిపారు. ఈనెల 4,5,6 తేదీల్లో కార్మిక సంఘాల ఎన్నికలు జరిగాయి. కాగా గురువారం గుంతకల్లులో కౌంటింగ్ జరిగినట్లు వారు తెలిపారు. తమ సంఘం విజయం సాధించడంపై వారు కార్మికులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కడపలో మజ్దూర్ యూనియన్ సంబరాలు



కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే గుర్తింపు సంఘ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ విజయం సాధించింది. గురువారం కడప రైల్వేస్టేషన్‌లో మజ్దూర్ యూనియన్ నాయకులు బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. తమ యూనయన్‌ని గెలిపించిన రైల్వే ఉద్యోగులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎస్.మొహిద్దీన్ మృతి



కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడ ప మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, మాజీ రాష్ట్ర మైనార్టీ కమిషన్ మెంబర్ ఎస్ మొహిద్దీన్ అనారోగ్యం కారణంగా బుధవారం మృతి చెందాడు. ఈయన 1981 నుంచి చాలా పర్యాయాలు మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. అందరితో సోదరభావంతో మసలిన మొహిద్దీన్ మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు సంతాపం తెలిపారు.

## ఫ్యానుకు ఉరి వేసుకుని వ్యక్తి మృతి


శివశంకర్ మృతదేహం

రామాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తపల్లికి చెందిన సానే శివశంకర్(30) బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... సానే శివశంకర్‌కు రెండేళ్ల క్రితం కడపలో నివాసముంటున్న తన అక్క కూతురు రోహిణితో వివాహమైంది. వీరికి ఇంతవరకు పిల్లలు లేరు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తూ.. తరచూ మద్యం సేవించేవాడు. రోజు మాదిరే బుధవారం రాత్రి కూడా తాగి రావడంతో అతని తండ్రి మందలించాడు. దీంతో మనస్థాపం చెందిన శివశంకర్ జీవితంపై విరక్తితో బుధవారం రాత్రి ఫ్యానుకు ఉరి వేసుకుని చనిపోయాడు. పొద్దుపోయాక అతని తండ్రి గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

## రైలుకింద పడి వ్యక్తి మృతి



కొండాపురం, డిశంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగడిపల్లె రైల్వే స్టేషన్‌లో గురువారం రైలుకింద పడి చప్పిడి రేణుకారెడ్డి (54) అనే వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు తిరుపతి-హుబ్లీ ప్యాసింజర్ రైలుకింద పడి చనిపోయాడు. ఇతను రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడ్డడా లేదా రైలు ఎక్కుతూ కింద పడ్డాడా మరేదైనా కారణం ఉందా అనే కోణాల్లో విచారిస్తున్నట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇతను ఆర్టీ పీపీ కేవిరెడ్డి నగర్‌కు చెందినవాడిగా గుర్తించి.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

సింహాద్రిపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైకొత్తపల్లి గ్రామంలో గురవారం రోడ్డు ప్రమాదంలో కొక్కంటి. రామసుబ్బారెడ్డి(73) అనే వృద్ధుడు మృతి చెందాడు. సింహాద్రిపురం ఎస్ఐ తులసి నాగప్రసాద్ సమాచారం మేరకు రామసుబ్బారెడ్డి ఉదయాన్నే తన టీవీఎస్ బైక్‌పై పొలం వద్దకు వెలుతుండగా ఎదురుగా బొలోరా వాహనం వచ్చి ఢీకొట్టింది. దీంతో రామసుబ్బారెడ్డి అక్కడిక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమారులు కలరు. మృతుని మనువడు సందీప్‌రెడ్డి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## అనుమతులు లేని బోటు సీజ్

జమ్మలమడుగు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయంలో ఎలాంటి అనుమతులు లేకుండా నడపుతున్న బోటును ఇరిగేషన్‌శాఖ అధికారులు సీజ్ చేశారు. గురువారం గండికోట సర్పంచ్ కొంత మంది పర్యాటకులతో అనుమతి లేకుండా బోటు షికారు చేయిస్తున్నట్లు సమాచారం రావడంతో మైలవరం ఇరిగేషన్‌శాఖ అధికారులు దాడులు చేసి సీజ్ చేశారు. జలాశయంలో ఎవరైనా అనుమతి లేకుండా బోటు నడిపితే చర్యలు తప్పవన్నారు. బోటు షికారుకు అనుమతులు తప్పనిసరి అని ఏఈ తెలిపారు.

## వర్షానికి కూలిన చింతచెట్టు... తప్పిన ప్రమాదం



పుల్లంపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై హైవేపక్కనే ఉన్న పెద్ద చింత చెట్టు జడివానకు కూలిపోయింది. దీంతో ఓ ఇల్లు పూర్తిగా దెబ్బతినగా 2 విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. చెట్టు కూలిన సమయంలో రోడ్డుపైన, ధ్వంసమైన ఇంటిలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మండల పరిధిలోని పుత్తనవారిపల్లె వద్ద జాతీయ రహదారి పక్కనే పెద్ద చింత చెట్టు ఉంది. రెండు రోజులుగా కురుస్తున్న జడివానకు గురువారం సాయంత్రం ఉన్నఫళంగా కూలిపోయింది. దీంతో రెండు విద్యుత్ స్తంభాలపై పడడంతో పూర్తిగా విరిగిపోయాయి. పక్కనే ఉన్న ఇల్లు కూడా పూర్తిగా దెబ్బతినింది. ఆ సమయంలో ప్రజలు ఎవరూ లేక ప్రమాదం తప్పడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

## అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం

పోరుమామిళ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అధికారుల అనుమతులు లేకుండా జాతీయ రహదారి పనులకు మట్టిని తరలిస్తుండగా తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. చిన్నాయపల్లె రెవెన్యూ సదస్సు ముగించుకుని వస్తుండగా మట్టిని తరలిస్తున్నారన్న విషయం తెలియడంతో బుధవారం రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. గురువారం కూడా మరో ప్రాంతం నుంచి రెండు టిప్పర్లు మట్టిని తరలిస్తుండగా వాటిని కూడా తహసీల్దార్ కార్యాలయానికి తరలించి విషయాన్ని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

## బ్రౌన్ స్ఫూర్తితో భావితరాలకు ఆదర్శంగా నిలవాలి

- వైవీయూ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి


బ్రౌన్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఆచార్య కె.కృష్ణారెడ్డి

కడప కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విదేశీయుడైనా తెలుగుభాషా అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన సీపీ బ్రౌన్ స్ఫూర్తితో యువత తెలుగుపై మక్కువ పెంచుకుని భావితరాలకు ఆదర్శంగా నిలవాలని వైవీయూ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి తెలిపారు. వైవీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని సమావేశ మందిరంలో బ్రౌన్ 141వ వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత బ్రౌన్ చిత్రపటానికి అతిథులతో కలిసి పూలమాల సమర్పించి మాట్లాడారు. 19వ శతాబ్దంలో సీపీ బ్రౌన్ అంత గొప్పగా శ్రమించకుంటే తెలుగు భాషా సాహిత్యం అధోగతి పాలయ్యేదన్నారు. తెలుగు భాష గొప్పతనాన్ని విదేశీయులకు చాటిచెప్పాడన్నారు. ఇవాళ తెలుగు భాషా సాహిత్యం ఇంతగా వెలుగొందడానికి కారణభూతుడు బ్రౌన్ అని కొనియాడారు. వైవీయూ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాధరెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతిలో తెలుగు కావ్యాలను పరిష్కరింపచేసిన ఘనత సీపీ బ్రౌన్‌దే అన్నారు. అనంతరం బ్రౌన్ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, పద్యపఠన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి. పార్వతి, సహాయ సంచాలకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యాపకులు ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి, ఆచార్య ఎం.వినోదిని, పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు జీవనాధారమైన అభివృద్ధి కల్పించాలి : డీపీవో


సమావేశంలో మాట్లాడతున్న డీపీవో రాజ్యలక్ష్మి

చెన్నూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు జీవనాధారమైన అభివృద్ధి కల్పించాలని.. ఇందుకోసం ప్రతీ గ్రామ పంచాయతీలో ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. రెండు రోజుల శిక్షణలో భాగంగా చెన్నూరులో గురువారం మండలస్థాయి అధికారులు, పంచాయతీ సర్పంచ్‌లు, సచివాలయాల సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రతి గ్రామాభివృద్ధికి ఎన్నో రకాల ప్రణాళికలు పంచాయతీల ద్వారా తయారు చేయడం జరిగిందన్నారు. అవన్నీ జీననాధారంగా ఉన్నపుడు మాత్రమే జరిగిన అభివృద్ధికి సార్థకత వుంటుందన్నారు. అన్నిశాఖల అధికారులు సర్పంచులతో కలిసి ప్రజల కోసం పాటుపడాలన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ ఆశయమన్నారు. ఇందుకోసం ప్రతీ మండలంలో రెండు రోజుల పాటు అందరికీ అవగాహనతో కూడిన శిక్షణలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, ఈఓఆర్‌డీ సురేష్‌బాబు, పంచాయతీరాజ్ ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు మల్లికార్జునరావు, ఉమా మహేశ్వర్‌రెడ్డి, ఏపీఎం వెంకటేశ్, సర్పంచ్‌లు చంద్రయాదవ్, సుదర్శన్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, కార్యదర్శులు గురవేశ్వరరావు, శివకుమార్, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి

- ట్రిపుల్‌ఐటీని తనిఖీ చేసిన వీసీ విజయ్‌కుమార్


ట్రిపుల్ఐటీలో మెస్‌ను పరిశీలించి సూచనలిస్తున్న ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ విజయ్‌కుమార్

వేంపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఐటీలో చదివే విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ ఆదేశించారు. కొద్దిరోజులుగా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులు కొందరు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారని పత్రికల్లో రావడంతో వీసీ ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీని గురువారం సందర్శించారు. మెస్‌లను తనిఖీ చేశారు. ఆసుపత్రిని సందర్శించారు. విద్యార్థులు, అధికారులతో మాట్లాడి పరిస్థితిని వాకబుచేశారు. ప్రధానంగా ట్రిపుల్‌ఐటీలో క్యాంటీన్లు లేకపోవడం వల్ల బయట నుంచి ఫుడ్ తెచ్చుకుంటున్నారని, పాత క్యాంపస్‌లోని ఒంగోలు ట్రిపుల్ఐటీ విద్యార్థులకు ఇక్కడి మసాలాలు పడకపోవడంతో కొంత ఇబ్బంది పరిస్థితి ఎదురైందని వీసీ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, క్యాంటీన్ల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది. రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ సండ్ర, డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ పెనుగొండ రవికుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

### క్యాంటీన్లను త్వరగా ఏర్పాటు చేయాలి

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో సుమారు 8500 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరితో పాటు అధ్యాపకులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. అక్కడ గతంలో ఉన్న క్యాంటీన్లు మూతపడ్డాయి. కొత్త క్యాంటీన్లు ఏర్పాటు చేయలేదు. సుమారు రెండు నెలలకు పైగా కావస్తున్నా క్యాంటీన్లు లేకపోవడతో విద్యార్థులు బయటఫుడ్ తెప్పించుకుంటున్నారు. క్యాంటీన్లు ఏర్పాటు చేస్తే ఇక్కడే అందుబాటులో ఉంటుందని విద్యార్థులు మొరపెట్టుకుంటున్నా అధికారులు సాత్పారం చేస్తున్నారు. ప్రధానంగా క్యాంటీన్ల ఏర్పాటు విషయంలో రాజకీయం నడుస్తోంది. వైసీపీ, టీడీపీకి చెందిన నాయకులు తమ వారికే తెప్పించుకోవాలన్న పట్టుదలతో అధికారులపై ఒత్తిడి తేవడంతో పాటు విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లారు. అయినప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో క్యాంటీన్ల ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. వీటిని అధిగమించి త్వరగా క్యాంటీన్ల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఆర్జీయూకేటీ ఉన్నతాధికారులపై ఉంది.

## గంగపేరూరు సాగునీటి సంఘాల ఓటరు లిస్టుపై ఫిర్యాదు


జేసీ అదితిసింగ్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

ఒంటిమిట్ట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగపేరూరు సాగునీటి సంఘాల ఓటరు లిస్టుపై జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు స్థానిక టీడీపీ నాయకులు, మాజీ కల్లుగీత కార్మిక సంఘం డైరెక్టర్ వెంకటనరసయ్య, గంగపేరూరు ఎంపీటీసీ సుబ్బరాయుడు ఫిర్యాదు చేశారు. కొద్దిరోజుల క్రితం ఓటరు లిస్టును, నోటీసును బోర్డులో పెట్టిన విధంగా కాకుండా గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్ చెప్పిన విధంగా ఆరు టీసీ నెంబర్ల పరిధిలో నూతనంగా దాదాపు 100 ఓట్లను చేర్చారని ఆరోపిస్తున్నారు. వీఆర్వో వైసీపీ వ్యక్తులతో కలిసి రెండు రోజుల్లో ఎన్నికలు ఉన్న సమయంలో ఇలా చేయడం ఏమిటని తహశీల్దారు రమణమ్మను ప్రశ్నించారు. వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించి మంత్రి వెంటనే జిల్లా అధికారులకు సమాచారం అందించి చర్యలు చేపడతామని తెలిపినట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు.

# గ్రామాల్లో సుస్థిర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం





సింహాద్రిపురం: కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి, ప్రజా ప్రతినిధులు...వీఎన్‌పల్లెలో శిక్షణ ఇస్తున్న అధికారులు... చక్రాయపేటలో శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డి

సింహాద్రిపురం,డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామాల్లో సుస్థిర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ కృష్ణమూర్తి పేర్కొన్నారు. గురువారం సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై జరిగే రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ఎంపీడీఓ కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ శిక్షణలో పంచాయతీలోని గ్రామాల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**లక్ష్య సాధన దిశగా పనిచేయాలి**

వీరపునాయునిపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధన దిశగా పనిచేయాలని ఎంపీడీఓ చంద్రమౌళి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సుస్థిరాభివృద్ధి సాధన నిమిత్తం సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సమన్వయంతోనే సాధ్యమని భావించి ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈఓపీఆర్డీ పులిరామ్‌సింగ్, ఎంఈఓ జాఫర్ సాదిక్, ఎంటీటీ నాగభూషణరెడ్డి, వెలుగు ఏపీఎం భాగ్యమ్మ, ఏపీఓ, ఎన్ఆర్‌జీఎస్ లక్ష్మీనారాయణ శిక్షణ ఇచ్చారు.

**కమలాపురంలో...**

మండల పరిషత్ కార్యాలయంలో 'స్థానికీకరణ - స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు' అంశంపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు.

**శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి**

సికెదిన్నె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ కుళాయిబాబు తెలిపారు. గురువారం మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి పాటించాల్సిన మెలకువలు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**చక్రాయపేటలో...**

చక్రాయపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ మండల అభివృద్ధి సమృద్ధిపాలనపై రెండు రోజుల పాటు మండల కేంద్రంలో శిక్షణ నిర్వహించారు. ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని సచివాలయాలకు సంబంధించిన ఉద్యోగులు, మండలాధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. మండలంలోని కార్యదర్శులు, మండల అధికారులు, వీఆర్వోలు, సర్వేయర్లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలు శుక్రవారంతో ముగుస్తాయని ఎంపీడీఓ తెలిపారు.

## గ్రామాల అభివృద్ధికి బాధ్యతగా విధులు నిర్వర్తించాలి: ఎంపీడీఓ



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి

పులివెందుల రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి అప్పగించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి, ఈఓపీఆర్డీ శారద సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో మండలస్థాయి అధికారులు, సర్పంచులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుపరిపాలన కోసం రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరోగ్యవంతమైన గ్రామానికి దోహదపడే అంశాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహ నిషేధ చట్టం, విద్యా హక్కు చట్టం, సుపరిపాలన కలిగిన గ్రామం, అములులో ప్రధాన సమస్యలు, పేదరిక నిర్మూలన, ఆరోగ్యకరమైన గ్రామం, బాలహిత పంచాయతీలు, నీటి సమృద్ధి గల గ్రామం, పరిశుభ్రమైన గ్రామం, స్వయం సమృద్ధితో మౌళిక సదుపాయాల గల గ్రామం, సామాజిక న్యాయం, సామాజిక భద్రత, మహిళా స్నేహపూర్వక గ్రామం తదితర అంశాలపై వివరించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ, ఏపీఎం, ఏపీఓ, సర్పంచులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మండలాన్ని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలుపుదాం



జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ, పెండ్లిమర్రి

ఫటాఫట్

పెండ్లిమర్రి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలాన్ని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సహకారంతో జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలుపుదామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూలో ఆ వివరాలు తెలిపారు.

**ప్రశ్న:** మండల సమగ్రాభివృద్ధికి మీరు చేపట్టబోయే చర్యలేవి?

**జవాబు:** మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామాలలో మౌలిక వసతులైన డ్రైనేజీ కాల్వలు, వీధిలైట్లు, సీసీరోడ్లు తదితర వాటిపై దృష్టిసారించాం. ఎమ్మెల్యే సహకారంతో నిధులు మంజూరు చేయించుకొని వాటిని పూర్తి చేస్తాం.

**ప్రశ్న:** ప్రస్తుతం మండలంలో ఏయే అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి?

**జవాబు:** ప్రస్తుతం మండలంలోని పంచాయతీలలో సీసీరోడ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. మండలానికి ఉపాధి హామీ నిధుల కింద సీసీరోడ్ల నిర్మాణానికి రూ.2.98కోట్లు నిధులు మంజూరయ్యాయి. 25 మినీ గోకులాలు మంజూరై పనులు జరుగుతున్నాయి.

**ప్రశ్న:** సంక్షేమ పథకాల అమలు తీరు ఎలా ఉంది?

**జవాబు:** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నాం. ప్రస్తుతం మండల వ్యాప్తంగా హౌస్‌హోల్డ్ సర్వే జరుగుతోంది. ప్రతి లబ్ధిదారుడికీ బ్యాంకు లింకేజీ కార్యక్రమాన్ని చేపడుతున్నాం.కొత్త పింఛన్‌లపై అధికారికంగా జీఓ రాలేదు.

**ప్రశ్న:** పారిశుధ్యంపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

**జవాబు:** ప్రతి గ్రామ పంచాయతీలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రతి ఫ్రైడేని డ్రైడేగా ప్రకటించి సిబ్బంది గ్రామాలలో పర్యటించి అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం పనులు చేపడుతున్నాం. పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామాలలో విస్తృతంగా పర్యటించి ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేయిస్తున్నాం.

**ప్రశ్న:** ఉపాధి పనులు మండలంలో ఎలా జరుగుతున్నాయి?

**జవాబు:** జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వందరోజుల పని కల్పిస్తున్నాం. ఎప్పటికప్పుడు ప్రజలకు ఉపయోపడే కొత్త పనులు గుర్తించి చేపడుతున్నాం. అలాగే గ్రూపులకు కూడా పనులు గుర్తించి చేయిస్తున్నాం.

## జీఎన్‌ఎమ్, బీఎస్సీ నర్సింగ్ కోర్సులకు విదేశాల్లో ఉద్యోగాలు

ఏపీఎస్ఎస్‌డీసీ ఈడీ మనోహర్




మాట్లాడుతున్న దేవపట్ల మనోహర్... హాజరైన నర్సింగ్ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ కోర్సులకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని ఏపీఎస్ఎస్‌డీసీ ఈడీ మనోహర్ పేర్కొన్నారు. గురువారం కడప నగరం శారద నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ గ్రాడ్యుయేట్ల ఉద్యోగ అవకాశాలను పెంపొందించడంలో ఒక ముఖ్యమైన అడుగులో భాగంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. నర్సింగ్ నిపుణుల సమీకరణ ఉద్యోగ అవకాశాలు బలోపేతం చేయడానికి స్కిల్ ఇంటర్నేషనల్ కార్యక్రమం విస్తృత ప్రయత్నాలలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో 200 మంది నర్సింగ్ గ్రాడ్యుయేట్లు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ నర్సుల కోసం అందుబాటులో ఉన్న అనేక విదేశీ ఉద్యోగ అవకాశాలపై వివరించారు. సురేష్‌కుమార్, జిల్లా ఉపాధి అధికారి రామమోహన్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, శారద కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ భానుప్రియ పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీకి విశేష కృషిచేసిన జనమంచి గౌరీశంకర్ (గౌరీజీ) పేరుపై జనమంచి గౌరీశంకర్ యువ పురస్కారానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు మల్లికార్జున గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాజంపై సానుకూల ప్రభావం చూపే సేవా కార్యక్రమాలకు నూతన ఆవిష్కరణలు, ప్రముఖ రంగాలలో విశేష కృషి చేస్తూ, యువత స్ఫూర్తిగా నిలిచే 40 ఏళ్లలోపు వయసు కలిగిన వారు అర్హులన్నారు.రూ.50వేలు నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందిస్తారన్నారు.

## అన్నదాతలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం: వైసీపీ

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయం లేదని, ఎన్నికల హామీల్లో ఇస్తామని చెప్పిన రూ.20వేలు ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయలో 'అన్నదాతలకు అండగా..' అన్న పేరుతో తలపెట్టిన ర్యాలీ, నిరసన కార్యక్రమానికి సంబంధించి సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం లేదని, ఇస్తానన్న డబ్బు కూడా ఇవ్వలేదన్నారు. మద్దతు ధర లేదని, రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. తడిసిన, రంగుమారిన ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం తగదన్నారు.

## ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అనాగరిక చర్య: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న గంగిరెడ్డి

పెండ్లిమర్రి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపల్లె గ్రామ సమీపంలో ఉన్న స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం అనాగరిక చర్య అని టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం టీడీపీ నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఏడాది టీడీపీ నాయకులు జయంతి, వర్ధంతి రోజున విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, కిలో రూ.2 బియ్యం ప్రవేశపెట్టిన మహనీయుడు ఎన్టీఆర్ విగ్రహానికి తల, చేతిని బండతో కొట్టి ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. ఈ విషయాన్ని శాసనసభ్యుడు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎమ్మెల్యే స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో పోలీసులతో మాట్లాడి నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలన్నారు. అలాగే ఆ విగ్రహం ఉన్న చోట మరొక విగ్రహాన్ని పెట్టిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో ఎక్కడ జరగకుండా నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు. మాజీ ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, అయ్యవారు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : ఈడీ



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ ఈడీ, యూనియన్ ప్రతినిధులు

కడప మారుతీనగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కడప జోన్ పరిధిలోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పైడి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రజా ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ కడప జోనల్ కమిటీ ఆధ్వర్యంలో ఈడీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ కడప జోన్ ముందు వరసలో ఉండేలా ఉద్యోగులంతా సమష్టిగా సేవలందించి లాభాలబాట పట్టించేందుకు శ్రమిద్దామన్నారు. అనంతరం ఈడీని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య, జోనల్ అధ్యక్షుడు కె.కె. కుమార్, కడప నాన్ ఆపరేషన్ విభాగ నాయకులు అంకిరెడ్డి, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### వైసీపీ నేతల మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరు

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు చెప్పే మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందన్నారు. గురువారం కడప నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటితో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరునెలలు పూర్తయిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకపోగా, కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో 16 వేల పోస్టులు భర్తీ చేస్తూ జూన్‌లో పాఠశాలలు తెరిచేలోగా డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు చేపట్టిందన్నారు. దేశంలోనే పింఛన్ల రూపంలో అధిక మొత్తంలో నగదు ఇస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. గత ప్రభుత్వం కూల్చివేసిన అన్న క్యాంటీన్లను రాష్ట్రంలోని 175 ప్రాంతాల్లో పునరుద్ధరించామన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారం టీడీపీ లక్ష్యం**

ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ ప్రభుత్వం లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం కడప నగరం శ్రీనివాసరెడ్డి నివాసంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలను, వినతులను తెలుసుకున్నారు. వాటికి పరిష్కార మార్గాలను అధికారులకు సూచించారు. వీలైనంత వరకు ప్రతి సమస్యకూ త్వరితగతిన పరిష్కారం చూపించాలని పేర్కొన్నారు.



## చెత్త సేకరణలో అలసత్వం వద్దు

- ప్రతిరోజు మూడు ట్రిప్పులు చెత్త తరలించాల్సిందే
- కడప కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి



మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో చెత్త సేకరణలో ఎటువంటి అలసత్వం చేయవద్దని, ఎప్పటికప్పుడు తొలగించాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. ప్రతిరోజు చెత్త వాహనాలు మూడు ట్రిప్పులు చెత్తను తీసుకెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. గురువారం ఉక్కాయిపల్లె జీటీఎస్, పుట్లంపల్లె ఎంసీసీ, జీటీఎస్‌లను ఆయన పరిశీలించారు. శానిటేషన్ విభాగం, పబ్లిక్ అండ్ హెల్త్ అధికారులతో కలిసి వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. అలాగే వినాయకనగర్ జీటీఎస్ క్లాప్ వాహనాల పట్టికలు, కార్మికుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు చెత్త వాహనాలు తప్పనిసరిగా మూడు ట్రిప్పులు తిరగాలని సూచించారు. ఉక్కాయిపల్లె జీటీఎస్ పూర్తిగా పరిశుభ్రపరచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. కంపోస్టు యార్డుకు సంబంధించి ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్‌తో చర్చించి తయారవుతున్న ఎరువులు, వాటి వినియోగాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ ధనలక్ష్మి, చంద్రశేఖర్, ఎంహెచ్‌ఓ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వం తీసుకోవాలి : ఎమ్మెల్యే



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవి, పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని అక్కాయపల్లె 47వ డివిజన్‌లో మెగా రక్తదాన శిబిరంతో పాటు, మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వాల వల్ల చాలా లాభాలు ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### వైసీపీ నాయకుడిని వెనక్కి పంపిన టీడీపీ

వేముల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల సందర్భంగా వైసీపీ, టీడీపీ మధ్య వాతావరణం వేడెక్కింది. సాగునీటి సంఘాల ఎన్నికలను టీడీపీ ఏకగ్రీవం చేసుకోవాలని ప్రయత్నాలు సాగిస్తోంది. ఇందుకు గురువారం వైసీపీ నాయకుడు పన్ను చెల్లించేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అక్కడున్న టీడీపీ నాయకులు వైసీపీ నాయకుడిని పన్ను కట్టకుండా తిప్పిపంపినట్లు సమాచారం.

### త్వరితగతిన భూ సమస్యల పరిష్కారం

చెన్నూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సరస్వతి అన్నారు. మండలంలోని కొండపేట గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడారు. ఇప్పటి వరకూ రైతులు తమ భూములకు సంబంధించి సమస్యల పరిష్కారం కోసం స్పందనలో అర్జీలు ఇచ్చారని, ఇకపై ఆ సమస్యలకు శాశ్వతంగా చెక్ పెట్టేందుకు రెవెన్యూ సదస్సులు వేదికగా మారాయన్నారు.

**రెవెన్యూ గ్రామ సభలు సద్వినియోగం చేసుకోవాలి**

పులివెందుల టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మహ్మద్ నజీర్ కోరారు. గురువారం గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పెద్ద రంగాపురం గ్రామంలో సంబంధిత అధికారులతో ర్యాలీ నిర్వహించారు.

**ఉర్దూ క్యాలెండర్ ఆవిష్కరణ**

కడప కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రానున్న నూతన సంవత్సరం (2025) సందర్భంగా ఆస్తానే ఎ హుస్సేనియా లజన్నతుల్ ఉల్మా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను గురువారం నగర రెండవ గాంధీబొమ్మ సర్కిల్ వద్ద గల సొసైటీ కార్యాలయంలో ముస్లిం మత గురువులు ఆవిష్కరించారు.

## వైభవంగా పోలేరమ్మ, సత్యమ్మతల్లి జాతర

### బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న మహిళలు



బోనాలు తీసుకువెళుతున్న మహిళలు

బద్వేలుటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లరోడ్డు రాజుగారివీధిలో వెలసిన పోలేరమ్మ, సత్యమ్మతల్లి ఆలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోరినకోర్కెలను తీర్చేటం గారు తల్లి సత్యమ్మతల్లి, పోలేరమ్మతల్లి అంటూ మొక్కుకున్నారు. పట్టణ ప్రజలు, పరిసరప్రాంత ప్రజలు, బంధుమిత్రులు ఒక్కసారిగా ఆలయానికి చేరుకోవడంతో ఆలయమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. అనంతరం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఆకాశంలో మబ్బులు - రైతన్న గుండెల్లో గుబులు

● ధాన్యం ఆరబెట్టుకోలేక ఇబ్బందులు



రోడ్డుపైనే వరి ధాన్యం కుప్పలు పోసిన రైతులు

ఖాజీపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందాలంటే వరుణదేవుడు సల్లంగా సూడాలి. లేదంటే పండించిన పంట నీటి పాలుగాక తప్పదు. ఈ ఏడాది నాలుగు రూకలు సంపాదించుకుందాం అనుకుంటే పైరు దిగుబడి ఆశాజనకంగా ఉన్నా ఆకాశంలో మబ్బులు వచ్చి తుంపర చినుకులు పడుతున్నాయి. ఫలితంగా కోసిన వరి ధాన్యం ఎండక, దళారులు అందినకాడికి దోచుకుంటున్నారు. గతేడాది వరి ధాన్యం ఎనిమిది బస్తాలు రూ.16వేలు ఉంటే ఈ ఏడాది రూ.10 వేలే నడుస్తోందని ఆరబెట్టుకోవాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకోవాల్సిన దుస్థితి వచ్చింది. రోడ్లపై ధాన్యం పోయడం వలన రైతులకు ఎటువైపు నుంచి ముంపు వస్తుందో తెలియక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డు పక్కన వేసుకుంటున్నారు. రాత్రివేళ అయితే ఆ కుప్పలపై నుంచి వాహనాలు వెళ్లిపోతున్నాయి. రైతులు ఏమీ చేయలేక చూస్తూ ఉన్నారు.

## శాస్త్రోక్తంగా అయ్యప్ప విగ్రహ పునః ప్రతిష్ఠ

### వైభవంగా పడిపూజ



కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ తదితరులు

బద్వేలుటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప అంటూ అయ్యప్పస్వాముల శరణు ఘోష మధ్య హరిహర సుతుడు అయ్యప్పస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. నెల్లూరు రోడ్డు నాగులకట్ట సమీపంలో అయ్యప్పస్వామి ఆలయ పునఃప్రతిష్ఠను అయ్యప్పస్వామి ఆలయ అధ్యక్షుడు రాగిమాను ప్రతాప్ కుమార్, అయ్యప్పస్వామి కమిటీ సభ్యులు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా జరిగింది. ఏకశిలపై పవిత్రమైన 18పడిమెట్ల నిర్మాణం, స్వామివారి ఏక శిలాధ్వజస్తంభంతో ఆలయాన్ని నిర్మించారు. 5వ రోజు గురువారం తెల్లవారు జామున వేదపండితులచే శాస్త్రోక్తంగా యంత్ర ప్రతిష్ఠ, విగ్రహప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, శిఖరకలశ ప్రతిష్ఠ, ధ్వజప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రాతఃకాలపూజ, చండీపారాయణం, రుద్రపారాయణం, దీక్షాహోమము, శాంతి హోమము, పౌష్టిక మూలమంత్ర హోమాలు, పూర్ణాహుతి, కుంబాభిషేకం వైభవంగా నిర్వహించారు. విగ్రహప్రతిష్ఠకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి హాజరై అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఆర్యవైశ్య విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



విద్యార్థికి ఉపకార వేతనం అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో ఉపకార వేతనాలను అందజేశారు. గురువారం వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు దాతల ద్వారా స్కాలర్‌షిప్‌లు అందజేశారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, బీటెక్ చదువుతున్న 150 మంది విద్యార్థులకు మొత్తం రూ.1.60 లక్షలు అందజేశారు. ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు నగదు పురస్కారాలను స్ఫూర్తిగా తీసుకుని మరింత ప్రతిభ కనపరచాలని సూచించారు. విద్యద్వారా ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరి మురికి సుబ్రమణ్యం, పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి కృషి చేయండి

### శిక్షణలో డీఎల్‌పీఓ తిమ్మక్క




సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

మైలవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికా బద్ధంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని డీఎల్‌పీఓ తిమ్మక్క, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో అధికారులు, సర్పంచులు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన రెండు రోజుల శిక్షణలో ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక తయారు చేసుకోవాలని, పారిశుధ్యంపై ప్రజలు దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధి ఎంత ముఖ్యమో ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని, ఈ రెండింటికీ మొదటి ప్రాధాన్యత కల్పించాలన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు వెలుగు ఏపీఎం శ్రీహరి, ఇంజనీరు వెంకటేశ్వరరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.

### సుస్థిరాభివృద్ధి సాధించాలి

ప్రొద్దుటూరురూరల్, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ భవనం, స్త్రీశక్తి భవనంలో రెండు బ్యాచ్‌లుగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, స్థానికీకరణపై శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. మండలస్థాయి అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఖాజీపేటలో...

ఖాజీపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేయాలన్న ధ్యేయంతో ప్రతి ఒక్కరూ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ దివిజ సంపతి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సుస్థిర పాలన, అభివృద్ధి అంశాలపై శిక్షణలో ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పరచాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయపరుస్తూ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలన్నారు. సూపరింటెండెంట్ వెంకటరమణ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### పంచాయతీ అభివృద్ధే లక్ష్యం

ముద్దనూరు డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందని, తద్వారా జిల్లా, రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని ఎంపీడీఓ ముకుందారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో అధికారులు, ప్రజా ప్రతినిధులకు స్థానికీకరణ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల శిక్షణ నిర్వహించారు. ఈఓపీఆర్డీ వీరభద్రుడు, ఈఓ నరసింహులు, సర్పంచులు పాల్గొన్నారు.

### కాశినాయనలో...

కాశినాయన డిసెంబరు12:(ఆంధ్రజ్యోతి) క్షేత్ర స్థాయిలో అన్నిశాఖల్లో సుస్థిరమైన అభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఎంపీడీఓ మైథిలీ రెడ్డి పేర్కొన్నారు. నర్సాపురం వెలు గు కార్యాలయ సభా భవన్‌లో సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగుల శిక్షణలో ఉద్యోగులకు దిశా నిర్దేశం చేశారు. ఏఈలు బాల పుల్లయ్య, బాలిరెడ్డి సందీప్, ఎంఈఓ నిర్మల, ఈఓపీఆర్డీ ముజఫర్ రహీం, ఏఓ విజయలక్ష్మి, సర్పంచులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### గోపవరంలో...

గోపవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామానికీ మౌలిక సదపాయాల రూప కల్పన చేయడమే ప్రధాన లక్ష్యమని ఈఓపీఆర్‌డీ షేక్ హసీనా అన్నారు. ఎంపీడీఓ సభా భవనంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. పీఆర్ ఏఈ శ్రీనివాసులు, ఎంఈఓ రఘురాములు, వైద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, సర్పంచ్‌లు, కార్యదర్శులు, విజయ్‌కుమార్, శ్రీనివాసుల రెడ్డి, నిఖిత, తదితరులు పాల్గొన్నారు.

# 'స్వామియే శరణం అయ్యప్ప'

### పెన్నాతీరంలో మిన్నంటిన శరణుఘోష ● వేడుకగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెన్నాతీరంలో 'స్వామియే శరణం అయ్యప్ప' శరణుఘోష మిన్నంటింది. అయ్యప్పస్వామి ఆలయంలో మండల పూజలో భాగంగా స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం అయ్యప్పస్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి సుందరంగా అలంకరించారు. సాయంత్రం అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తిని హంస వాహనంపై ఆశీనులను చేశారు. అయ్యప్పస్వామి మాలధారులు, భక్తులు అయ్యప్పస్వామి నామస్మరణలతో పురవీధుల్లో స్వామివారి గ్రామోత్సవం శోభాయమానంగా సాగింది. అమ్మవారిశాల నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం బంగారు అంగళ్లు, సుందరాచార్యుల వీధి, గాంధీరోడ్డు మీదుగా శివాలయం సెంటర్‌కు చేరింది. ఈ సందర్భంగా నరసారావుపేట తప్పెట్లు, కోలాటం, బాణసంచా పేలుళ్లు ఆకట్టుకున్నాయి. దారి వెంబడి భక్తులు స్వామివారికి కాయాకర్పూరం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు. మహిళలు, చిన్నారులు దీపాలతో అయ్యప్పస్వామికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్వామి అయ్యప్పసేవా సంఘం అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి, టీటీడీ మాజీ సభ్యుడు టంగుటూరు మారుతీప్రసాద్, శ్రీరాంనారాయణ, నటకల సతీష్, నామావాసు, టంగుటూరు వినోద్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## కౌశల్ క్విజ్ రాష్ట్ర పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కౌశల్ క్విజ్ రాష్ట్రస్థాయి పోటీలకు వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 6వ తేదీ నిర్వహించిన జిల్లాస్థాయి కౌశల్ క్విజ్ పోటీల్లో ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయిలో 9వ తరగతి విద్యార్థి గురుకావ్య మొదటిస్థానంలో నిలవగా జిక్రా ద్వితీయస్థానంలో నిలిచింది. 8వ తరగతి విద్యార్థి తస్లీమా ద్వితీయ స్థానంలో నిలిచింది. పోస్టల్ డిజైన్ విభాగంలో 9వ తరగతి విద్యార్థి హాసిఫా మొదటి స్థానం, 8వ తరగతి విద్యార్థి తేజశ్విని ద్వితీయ స్థానంలో నిలిచింది. వీరిని ప్రధానోపాధ్యాయుడు నాగార్జునరెడ్డి, ఉపాధ్యాయుడు అభినందించారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిపించాలి

### ఆర్డీఓ సాయిశ్రీని కలిసిన ఎమ్మెల్సీ



జమ్మలమడుగు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నీటిసంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆర్డీఓ సాయిశ్రీకి విజ్ఞప్తి చేశారు. గురువారం రాత్రి 7 గంటలకు కార్యాలయంలో ఆర్డీఓను కలిసి వినతిపత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కూటమి నేతలు అధికారులను బెదిరించారన్నారు. అందుకే సాయంత్రం వరకు ఆయా గ్రామాల్లో ఎన్నికలకు సంబంధించిన నోడ్యూ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారన్నారు. కొందరు తహసీల్దార్లు కూటమి నేతల బెదిరింపులకు భయపడి వీఆర్వోలు, సెల్‌ఫోన్లు స్విచ్‌ఆఫ్ చేసుకుని ఎక్కడ ఉండేది తెలియలేదని ఆయన ఆరోపించారు. జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం తదితర గ్రామాల్లో రైతులు నీటి సంఘాల ఎన్నికలకు నిబంధనల మేరకు సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉంది. కూటమి నేతల బెదిరింపులతో వైసీపీ నుంచి పోటీ చేసే రైతులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా, ఇచ్చే కొందరిని బెదిరించడం దారుణమన్నారు. ఇలా కాకుండా నేరుగా కూటమి నేతలే ఎన్నికలు డిక్లేర్ చేసుకుని ఉండాల్సిందన్నారు.

## 'భక్తులు సంయమనంతో వ్యవహరించాలి'

కాశినాయన డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): కాశినాయన ఆరాధనకు వచ్చే భక్తులు సంయమనంతో వ్యవహరిస్తూ పోలీసులకు సహకరించాలని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, కాశినాయన ఎస్ఐ హనుమంతు భక్తులకు సూచించారు. జ్యోతి క్షేత్రంలో జరగనున్న కాశినాయన ఆరాధనలో భాగంగా గురువారం వారు జ్యోతిక్షేత్రాన్ని సందర్శించి ఆలయ నిర్వాహకులతో మాట్లాడారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించి రెండు రోజుల ఆరాధనలో చేపట్టాల్సిన భద్రతాచర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. ఎస్ఐ కొండారెడ్డి, సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఘనంగా విజయమ్మ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న చెన్నరాయుడు, సర్పంచ్ యనమల సుధాకర్

పోరుమామిళ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే విజయమ్మ జన్మదిన వేడుకలు పోరుమామిళ్ల టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సీసీఆర్ లాడ్జి సమీపంలో నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ జన్మదిన వేడుకల్లో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చెరుకూరి చెన్న రాయుడు, పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, టీడీపీ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కలవకూరి చిన్న వెంకటసుబ్బయ్య, కొండా దుగ్గిరెడ్డి, మల్లికార్జున రెడ్డి కేక్‌ను కట్‌చేసి టీడీపీ నేతలు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. నేతలు పెద్దిరెడ్డి వెంకటరెడ్డి, కలవకూరి రమేష్, ఎంపీటీసీ కలవకూరి రమణ, మాజీ ఎంపీటీసీ శెట్టింప్రతాప్, అతికారి రాజ, లక్ష్మణరావు, పాపయ్య పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రైవేటు పాఠశాలల జిల్లా అధ్యక్షుడు

బద్వేలు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కృష్ణా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌కుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం పేర్కొన్నారు. నారాయణ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో నిర్వహించిన ప్రైవేటు పాఠశాల యజమానుల సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ 22న ఆదివారం కడపలో జరిగే కృష్ణా సమావేశంలో ప్రైవేటు పాఠశాలల సమస్యలపై చర్చిస్తామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు లెక్కల జోగిరామిరెడ్డి, గోపిరెడ్డి పాఠశాల కరస్పాండెంట్ బ్రహ్మానందరెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగుంట్ల పోలీసు స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ

ఎర్రగుంట్ల, డి సెంబరు 12: జమ్మలమడుగు డీఎస్పీ వెంకటే శ్వర్లు ఎర్రగుంట్ల అర్బన్ పోలీసు స్టేషన్‌ను గురు వారం సందర్శిం చారు. స్టేషన్ సి బ్బంది ఆయన కు గౌరవ వంద నం నిర్వహించారు. అనంతరం ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు. ఇక్క డి పరిస్థితిపై సమీక్షించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ నరేష్‌బాబు, ఏఎస్‌లు, తదితరులు పాల్గొన్నారు.

## 'సాగునీటి ఎన్నికలను బహిష్కరిస్తున్నాం'

ఖాజీపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శనివారం జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి అన్నారు. విలేకరులతో మాట్లాడుతూ సాగునీటి ఎన్నికలను పకడ్బందీ, చిత్తశుద్ధిగా నిర్వహించాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేదని, పైకి మాత్రం సాగునీటి ఎన్నికల రహస్య ఓటింగ్ ద్వారా బ్యాలెట్ నిర్వహిస్తామని, క్షేత్రస్థాయికి వచ్చేసరికి అందుకు విరుద్ధంగా ఎన్నికల జాబితా ఉందన్నారు. అంతేకాకుండా రైతులను చిన్నచూపు చూస్తోందని అందువలన ఎన్నికలను బహిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అగ్రహారం సొసైటీ మాజీ చైర్మన్ రాఘవరెడ్డి, సర్పంచులు రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, పాల్గొన్నారు.

## ఎన్నికలకు సర్వం సిద్ధం

మైలవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. తొర్రివేముల, కట్టకింద చెరువు, కల్లుట్ల పంచాయతీలోని నల్లచెరువు, బెస్తవేముల పంచాయతీలోని ఎర్రచెరువు, తలమంచి, కోన అనంతపురంలోని చిన్నయ్యచెరువు, వెంగక్క చెరువు, రామచంద్రాయపల్లె పంచాయతీలోని రేవుల చెరువుకు శనివారం నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు మండల ఇరిగేషన్ శాఖ అధికారి మురళి గురువారం తెలిపారు. మైలవరం జలాశయం కింద వచ్చే డబ్ల్యూ-1, డబ్ల్యూ-2 కింద వచ్చే వేపరాల, దొమ్మరనంద్యాల, చిన్నకొమెర్ల, తొర్రివేముల, నార్జాంపల్లె గ్రామాల పరిధిలో ఎన్నికలు జరుగనున్నాయి.

## అర్హులు దరఖాస్తు చేసుకోండి

బద్వేలు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో గృహ నిర్మాణానికి అర్హులు ఈ నెల 30వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఇప్పటి వరకు పాత వార్డుల ప్రకారం 356 దరఖాస్తులు తమకు అందాయని, పీఎంఏవై 2.0 స్కీం కింద ఆయా వార్డు సచివాలయాల పరిధిలో, లేదా సొంతగా పీఎంఏవై -2 స్కీం ఆన్‌లైన్‌లో గానీ దరఖాస్తుచేసుకోవచ్చన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు కాకుండా, సొంత స్థలం లేదా, స్థలం లేని వారు ఇందుకు అర్హులని గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## సదస్సులో 17 ఫిర్యాదులు

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బొల్లవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 17 ఫిర్యాదులు అందాయి. తహసీల్దారు గంగయ్య అధ్యక్షతన బొల్లవరం హరిజవాడ సచివాలయం-1 లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఇందులో 1బి ఖాతాలో సవరణకు 9, నిషేధిత భూముల జాబితా నుంచి తొలగింపునకు 6, ఇతర రెండు సమస్యలపై ప్రజలు, రైతులు ఫిర్యాదులు చేశారు.

## హెచ్ఐవీపై అవగాహన సదస్సు

జమ్మలమడుగు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూలులో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవంలో భాగంగా అవగాహన నిర్వహించారు. చైతన్య ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెడ్మాస్టర్ అనూరాధ, సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. షిరిడీసాయి జూనియర్ కళాశాలలో అవగాహన నిర్వహించారు. ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆటోక్లేవ్ బాయిలర్ వితరణ

పోరుమామిళ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైద్య విధాన పరిషత్‌కు మదర్ థెరిసా ఫౌండేషన్ ట్రస్టీ గిరిప్రణీత్ ఉచితంగా ఆటోక్లేవ్ మిషన్ వైద్యులకు అందజేశారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో వైద్యులు వెంకన్న, నాగేంద్ర, రవి, గౌరీ ప్రియ, ఆనంద్ పాల్గొన్నారు.

## బాల్యం నుంచే భగవద్గీత నేర్పాలి

పోరుమామిళ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచి బాల బాలికలకు భగవద్గీత నేర్పించాలని అది వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని టీటీడీ కడప జిల్లా ధర్మ ప్రచార మండలి సభ్యులు తుపాకుల శ్రీనివాసులు పేర్కొన్నారు. గీతా జయంతి సందర్భగా వేణుగోపాల్ స్వామి దేవస్థానంలో పెద్దలకు, చిన్నారులకు భగవద్గీత పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. చెన్న క్రిష్ణయ్య, రాగి రత్న ప్రభ, రవి కేశవ, కోకల సుబ్బారెడ్డి, సుష్మ, ఉమా దేవి తదితరులు పాల్గొన్నారు.



# పంట కాల్వలు పూర్తి చేయాలి : సీపీఎం



మహాసభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్ ఆయకట్టు కింద ఉన్న పంట పొలాలకు నీటి పారకం కోసం పంట కాల్వలు పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం బ్రహ్మంగారి మఠం మండల కేంద్రంలోని భారత కమ్యూనిస్టు పార్టీ మండల కమిటీ మహాసభలో ఆయన మాట్లాడుతూ బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసి 39 ఏళ్లు కావస్తోందని, ఇప్పటికీ సాగర్ చివరి ఆయకట్టు వరకు కాల్వలు పూర్తి చేయలేదని వివరించారు. కాగా పెన్నానదికి ఉపనది కుందూ వరద నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే రాజోలి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా బ్రహ్మంసాగర్‌కు నీటిని తరలించి మైదుకూరు నియోజకవర్గంలో మూడు మండలాలకు సాగు, తాగునీరు అందించాలనే సంకల్పంతో శిలాఫలకం వేసి ఐదేళ్లు గడిచినా ఇప్పటి వరకు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వమైనా నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని కోరారు. ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారి మఠంను జాతీయ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలని, భక్తులకు ఇక్కడ ఆధునిక సౌకర్యాలతో ఆర్టీసి బస్టాండ్ నిర్మించాలన్నారు. బ్రహ్మంసాగర్ ఆనకట్టకు లీకేజీల పరిష్కారానికి కాంక్రీట్ వాల్ నిర్మాణం జరగాలన్నారు. అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు, భూములు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సీనియర్ నేతలు బోలా శ్రీరాములు, హరి, రవణమ్మ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శివకుమార్, జిల్లా కమిటీ సభ్యుడు అన్వేష్, నేతలు గోవింద్, శివయ్య, సునీల్ కుమార్, అజయ్, సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## సదస్సులను సద్వినియోగం చేసుకోండి

పోరుమామిళ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శేషంపల్లిలో నిర్వహిం ఇన రెవెన్యూ సదస్సులో రైతులు తమ సమస్యలు అర్జీల రూపంలో తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు.